### ఆ వరుడికి లెక్కలేనన్ని కట్నకానుకలు



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..


గుంటూరు - బుధవారం 7 మే 2025 | సంపుటి:9 | సంచిక:131 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |



### 100 డ్రోన్లతో రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్



మాస్కోలో విమానాశ్రయాల మూసివేత! 6


## డయాఫ్రం వాల్ నిర్మాణంలో త్రీడీ చిత్రీకరణ అవసరం

### విదేశీ నిపుణుల బృందం సూచన

### బట్రస్ డ్యాం పనులపై సంతృప్తి



**అమరావతి, పోలవరం:** పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణ నాణ్యత, ఇందుకు చేపట్టిన పరీక్షలు, వాటి ఫలితాలపై విదేశీ నిపుణుల బృందం దష్టి సారించింది. ఈ ప్యానళ్లు దింపే క్రమంలో త్రీడీ దశ్యాలను చిత్రీకరించే పరికరాలు వాడాలని సూచించింది. విదేశీ నిపుణులు ఛార్లెస్ రిచర్డ్ డొన్నెల్లీ, డగ్లస్ హించ్‌బెర్గర్, బ్రియాన్ పాల్, డి.సిస్కోలు సోమవారం పోలవరం వచ్చారు. వీరు తొలుత కేంద్ర జల సంఘం, జలవనరులశాఖ అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తర్వాత బట్రస్ డ్యాం, గ్యాప్-1లో జి-డి కొండల మధ్య చేపడుతున్న పనులు, అక్కడి ...మిగతా 2లో

## 5 లక్షల కొలువులకు కార్యాచరణ

- పట్టభద్రులందరికీ నైపుణ్య పరీక్ష.. ఫలితాల ఆధారంగా శిక్షణ
- వీటి నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ
- మంత్రి కొలుసు పార్థసారధి



2



## పంట నష్టానికి తక్షణమే పెట్టుబడి సాయం

### పిడుగుపాటు మతుల కుటుంబాలకూ ఆర్థిక సాయం

### ధాన్యం కొనుగోలు చేయలేదనే మాట రాకూడదు

### అకాల వర్షాలపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

రాష్ట్రంలో అకాల వర్షాలు, పంటనష్టంపై సోమవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పిడుగుపాటుకు చనిపోయిన పశువులకు నిబంధనలకు అనుగుణంగా సాయం విడుదల చేయాలని చెప్పారు. అకాల వర్షాలతో 2,224 హెక్టార్లలో వరి, మొక్కజొన్న దెబ్బతిన్నాయని, 138 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మామిడి తదితర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు సీఎంకు నివేదిక ఇచ్చారు.

**అమరావతి:** అకాల వర్షాల కారణంగా పంటల నష్టాన్ని వెంటనే అంచనా వేసి, నష్టపోయిన రైతులకు మంగళవారం సాయంత్రంలోగా పెట్టుబడి సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పిడుగుపాటు కారణంగా చనిపోయిన 10 మంది కుటుంబాలకు తక్షణమే పరిహారం ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అకాల వర్షాలు, పంటనష్టంపై సోమవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పిడుగుపాటుకు చనిపోయిన పశువులకు నిబంధనలకు అనుగుణంగా సాయం విడుదల చేయాలని చెప్పారు. అకాల వర్షాలతో 2,224 హెక్టార్లలో వరి, మొక్కజొన్న దెబ్బతిన్నాయని, 138 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మామిడి తదితర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు సీఎంకు నివేదిక ఇచ్చారు. పశ్చిమగోదావరి జిల్లాలో 1,033 హెక్టార్లు, నంద్యాలలో 641, కాకినాడలో 530, శ్రీసత్యసాయి జిల్లాలో 20 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. కష్ణా, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, తిరుపతి, నంద్యాల, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు.

#### ధాన్యం అంతా కొనాల్సిందే

కేంద్రంతో మాట్లాడి రైతుల దగ్గర అదనంగా ఉన్న పంటను కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు వివరించారు. తమ ధాన్యం కొనలేదనే మాట.. ఏ ఒక్క రైతు నుంచి కూడా రాకూడదని చెప్పారు. రబీలో 20 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటికి 13 లక్షల టన్నులు సేకరించామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ ...మిగతా 2లో

## బేబీ కిట్ పథకాన్ని పునరుద్ధరించిన ప్రభుత్వం

**అమరావతి:** వైకాపా హయాంలో నిలిపివేసిన బేబీ కిట్ పథకాన్ని ఏపీ ప్రభుత్వం పునరుద్ధరించింది. నవజాత శిశువుల ఆరోగ్యం కోసం 11 వస్తువులతో కూడిన బేబీ కిట్‌ను అప్పటి తెదేపా ప్రభుత్వం పంపిణీ చేసేది. వైకాపా ప్రభుత్వం ఆ పథకాన్ని నిలిపివేయగా.. తాజాగా కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది.

### ఏపీ ఐసెట్‌కు సర్వం సిద్ధం..

## నిమిషం ఆలస్యమైనా అనుమతించం

**అమరావతి:** ఏపీ ఐసెట్ పరీక్షకు సర్వం సిద్ధమైంది. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మే 7న రెండు సెషన్లలో జరగనున్న ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 37,572 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్ష కోసం హైదరాబాద్‌లో ఒక కేంద్రం సహా మొత్తం 93 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏయూ వీసీ రాజశేఖర్ వెల్లడించారు. విద్యార్థులు గంటన్నర ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని.. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష హాల్‌కు అనుమతించబోమన్నారు.

### మే 7 నుంచి కొత్త రేషన్‌కార్డులకు

## దరఖాస్తుల స్వీకరణ

### మంత్రి నాదెండ్ల

**అమరావతి:** రాష్ట్రంలో మే 7నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొత్త కార్డులు జారీ, రేషన్‌కార్డు స్ప్లిట్, కొత్త సభ్యుల చేరిక, చిరునామా మార్పులు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రేషన్‌కార్డుల్లో మార్పుల కోసం 3.28లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డును జారీ చేస్తామని చెప్పారు. ఇందులో కుటుంబసభ్యుల పేర్లు చక్కగా కనిపించేలా ఉంటుందన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే గడిచిన ఆరు నెలలుగా తీసుకున్న రేషన్ వివరాలు కనిపిస్తాయని చెప్పారు.

''దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఈ కార్డు వెసులుబాటు కల్పిస్తుంది. నెలరోజులపాటు ఈ రేషన్ కార్డు దరఖాస్తుల ...మిగతా 2లో



### 339 అభివద్ధి పనులు..

## కోటంరెడ్డికి చంద్రబాబు, లోకేశ్‌ల అభినందనలు

**నెల్లూరు:** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న 339 అభివద్ధి పనుల గురించి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఉండవల్లి నివాసంలో సీఎంను ఆయన సోమవారం కలిశారు. మే 15న ఆయా ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని ముఖ్యమంత్రి అభినందించారు.

ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తోనూ ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాలను వివరించారు. వాటికి సంబంధించిన బుక్‌లెట్‌ను అందజేశారు.



### ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమాల కేసు..

## క్యామ్‌సైన్ డైరెక్టర్ ధాత్రి మధు అరెస్టు

**హైదరాబాద్:** ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమాల కేసులో 'క్యామ్‌సైన్ మీడియా' సంస్థ డైరెక్టర్ ధాత్రి మధును పోలీసులు అరెస్టు చేశారు.
గ్రూప్-1 మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడ్డారని అతడిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో హైదరాబాద్‌లోని అతడి కార్యాలయంలో మధును ఏపీ పోలీసులు అరెస్టు చేశారు.
అనంతరం విజయవాడకు తరలిస్తున్నారు.మూల్యాంకన కుంభకోణం కేసులో మధును ఏ2గా కోర్టులో పోలీసులు హాజరుపరచనున్నారు.
హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మూల్యాంకన నిర్వహణ బాధ్యతలను నిబంధనలకు విరుద్ధంగా కొటేషన్ విధానంలో పొందిన క్యామ్‌సైన్ సంస్థ.. ఇతర విషయాల్లోనూ అవకతవకలకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

## ఎఫ్ఏటీఎఫ్‌లో పాక్‌కు సెగ

### దాయాది దేశ ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు భారత్ మరో యత్నం



**ఢిల్లీ, మే 6 :** పహల్గాం ఉగ్రదా డి నేపథ్యంలో ఆర్థికంగా ఏకాకి చేసే దిశగా భారత్ చర్యలు వేగవంతం చేసింది. లష్కరే వంటి ఉగ్ర సంస్థలకు ఫండింగ్ చేస్తున్నందుకు ఆ దేశానికి శిక్ష పడేలా చేసేందుకు ఆర్థిక చర్యల కార్యదళం (ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్)లో కూడా పాక్ ను తిరిగి 'గ్రే లిస్ట్'లోకి చేర్చేందుకు చర్యలు మొదలుపెట్టింది. ప్రస్తుతం ఐఎంఎఫ్ నిధుల కోసం పాక్ చేస్తున్న ప్రయత్నాలకు గండి కొట్టాలంటే ఎఫ్ఏటీఎఫ్ చర్యలే కీలకంగా మారాయి. ఎఫ్ఏటీఎఫ్ భేటీలో పాక్ పై నిఘాను పెంచాలన్న ప్రతిపాదన భారత్ తీసుకొచ్చే అవకాశం ఉంది. వాస్తవానికి దీనిని 'గ్రే లిస్ట్'గా పేర్కొంటారు. ఈ జాబితాలో కొన్నేళ్లపాటు ఉన్న తర్వాత పాక్ 2022లో బయటపడింది. నాడు మనీలాండరింగ్, టెర్రర్ ఫైనాన్స్ ను అడ్డుకోవడానికి తీసుకొంటున్న చర్యలను చూపించి ...మిగతా 2లో

### రైలు బోగీల్లాంటివే

## రిజర్వేషన్లు

### కంపార్ట్‌మెంట్ లోపలికి వెళ్లినవాళ్లు బయటి వారిని రానివ్వరు

### సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** భారత దేశంలో కుల ఆధారిత రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రిజర్వేషన్లను రైలు బోగీతో పోల్చారు. రిజర్వేషన్ వ్యవస్థ రైలు కంపార్ట్‌మెంట్‌లా మారిపోయిం దన్నారు. ఒకసారి బోగీలోకి ప్రవేశించిన వారు.. ఇతరులు రావడానికి ఇష్టపడటంలేదని అన్నారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ...మిగతా 2లో

## అమరావతిలో 1050 ఎకరాల భూకేటాయింపు జరిగింది

### మంత్రి నారాయణ



**అమరావతి:** అమరావతిలో ఇప్పటి వరకు 1050 ఎకరాల మేర భూకేటాయింపులు జరిగాయని మంత్రి నారాయణ తెలిపారు. సీఆర్డీఏ 47వ సమావేశానికి ముందు మంత్రుల కమిటీ సమావేశమై భూకేటాయింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయాలను మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. లా యూనివర్సిటీకి 50 ఎకరాలు, క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలు, బసవ తారకం ఆస్పత్రికి అదనంగా మెడికల్ కాలేజీకి 6 ఎకరాలు, ఆదాయపు పన్ను శాఖకు 0.78 ఎకరాలు, రెడ్‌క్రాస్ సొసైటీకి 0.78 ఎకరాలు, కోస్టల్ బ్యాంక్‌కు 0.40 ఎకరాలు, ఐఆర్‌సీటీసీకి ఎకరం భూమిని కేటాయిస్తూ మంత్రుల కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

మరోవైపు, రూ.514 కోట్లతో గెజిటెడ్ అధికారుల నివాస భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. అక్కడ అదనపు మౌలిక సదుపాయాల కల్పనకు రూ.194 కోట్లకు సీఆర్డీఏ అనుమతి ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. 9 టవర్ల నాన్ గెజిటెడ్ అధికారుల నివాసాలు, మౌలిక సదుపాయాలకు రూ.517 కోట్లతో టెండర్లకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. రూ.494 కోట్లతో 15 ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి, రహదారులను జాతీయ రహదారులకు అనుసంధానం కోసం సీఆర్డీఏ అనుమతి తెలిపిందని మంత్రి నారాయణ వివరించారు.

### భారత్-బ్రిటన్ మధ్య

## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

### కుదిరినట్టు ప్రకటించిన ప్రధాని మోడీ • పరస్పర సుంకాల సడలింపు • 99 శాతం సరుకులపై జీరో టారిఫ్



**ఢిల్లీ, మే 6:** భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తో ఫోన్ సంభాషణ అనంతరం భారత ప్రధాని నరేంద్రమోడీ ఈ మేరకు ప్రకటన చేశారు. ఇంగ్లండుతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో పాటు, సామాజిక భద్రతా ఒప్పందం కుదిరినట్టు తెలిపారు. ఇరుదేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఈ ఒప్పందం ఓ మైలురాయిగా అభివర్ణించారు. దీనివల్ల రెండు దేశాలకూ లాభదాయకమన్నారు. స్టార్మర్ భారత్ లో పర్యటన కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

#### 99 శాతం సరుకులపై జీరో టారిఫ్

స్వేచ్ఛాఆ వాణిజ్య ఒప్పందం అంశంపై ఇరు దేశాల మధ్య మూడేండ్లుగా చర్చలు జరుగుతున్నాయి. స్వేచ్ఛా మార్కెట్, వాణిజ్య ఆంక్షల సడలించడం ద్వారా 2040 నాటికి ఇరు దేశాల వాణిజ్యాన్ని 25.5 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా దాదాపు 14 దఫాలుగా చర్చలు జరిగాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 20.36 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇరు దేశాల వాణిజ్యం 2023-24 నాటికి 21.34 బిలియన్ డాలర్లకు పెరిగింది. రాబోయే పదేండ్లలో ...మిగతా 2లో

## శ్రీవారి మెట్టు మార్గంలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

### టీటీడీ ఈవో శ్యామలరావు



**తిరుమల:** తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తులకు శ్రీవారి మెట్టు మార్గంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో జె. శ్యామలరావు తెలిపారు. కాలినడకన వెళ్లే మార్గంలో టోకెన్లు పొందేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయం తితిదే దష్టికి వచ్చిన నేపథ్యంలో.. తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి. వీరబ్రహ్మంతో కలిసి మంగళవారం కాలినడక మార్గంలో పరిస్థితిని పరిశీలించారు.

## డయాఫ్రం వాల్ నిర్మాణంలో
# త్రీడీ చిత్రీకరణ అవసరం

(మొదటి పేజీ తరువాయి)

ఫొటో ప్రదర్శనను పరిశీలించారు.డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రదేశానికి చేరుకుని, భూమి పటిష్ఠత, పనుల తీరుతెన్నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు వేసిన ప్యానళ్లు, ప్రయోగశాలలో చేస్తున్న పరీక్షలు, వాటి నివేదికలను సమగ్రంగా పరిశీలించారు. ఆ తర్వాత మధ్యాహ్నం నుంచి ప్రాజెక్టు వద్దే సమావేశమయ్యారు. డయాఫ్రం వాల్ మెథడాలజీపై గతంలోనే వారు కొన్ని ప్రశ్నలు లేవనెత్తగా ఆయా అంశాలపై పోలవరం అధికారులు కె.నరసింహమూర్తి, ఆఫ్రి, బావర్ కంపెనీ ప్రతినిధులు సమాధానాలు ఇచ్చారు. డయాఫ్రం వాల్ నిర్మాణంలో ప్యానళ్లు నిటారుగా కిందకు వెళుతున్నాయా, ఒక ప్యానల్‌కు మరో ప్యానల్ అనుసంధానం ఎలా ఉంది, అవి సవ్యంగా ఉన్నాయా అనే అంశాలు స్పష్టంగా తెలియాలంటే త్రీడీ నమూనాను చిత్రీకరించే యంత్రపరికరాలు వాడాలని విదేశీ నిపుణుల బృందం సూచించింది.

**కొండల జియాలజీపై చర్చ**

పోలవరం ఎగువ కాఫర్ డ్యాం వద్ద నిర్మిస్తున్న బట్రస్ డ్యాం నిర్మాణ పనులపై విదేశీ నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. డయాఫ్రం వాల్ పనులను పర్యవేక్షించే క్రమంలో బావర్ కంపెనీ అభ్యంతరాలపై కొంత చర్చ జరిగింది. రాయి తగిలిన తర్వాత ప్యానళ్లను 2 మీటర్ల లోపలకు తీసుకువెళ్లాలని సంబంధిత కేంద్ర సంస్థ నిపుణులు చెబుతున్నారు. కంపెనీ ప్రతినిధులు మాత్రం గట్టి రాయి తగలకముందే తేలిక రాయి నుంచి 2 మీటర్లు లెక్కిస్తున్నారని అన్నారు. గ్యాప్ 2 ప్రధాన డ్యాం, గ్యాప్ ప్రధాన డ్యాం చివర్లో ఉన్న కొండల జియాలజీపై చర్చ జరిగింది. ఆ ప్రాంతాన్ని నిపుణులు పరిశీలించారు. పీపీఏ కార్యదర్శి ఎం.రఘురామ్, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు, కేంద్ర జలసంఘం అధికారులు, సీఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్తలు, వివిధ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.డయాఫ్రంవాల్ నిర్మాణంలో ఉపయోగించేందుకు జర్మనీ నుంచి తీసుకొచ్చిన విడిభాగాలతో మూడో కట్టర్ బిగింపు పనులను సోమవారం ప్రారంభించారు.

# పంట నష్టానికి తక్షణమే పెట్టుబడి సాయం

(మొదటి పేజీ తరువాయి)

సీఎంకు తెలిపారు. వర్షాలకు రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

**వర్షాలపై అప్రమత్తంగా ఉండండి**

పలు జిల్లాలకు వర్ష సూచన ఉందని.. కలెక్టర్లు, అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, విపత్తుల వేళ అధికారులు మానవత్వంతో పనిచేయాలని సూచించారు. పిడుగులు పడే సమయాల్లో సెల్‌ఫోన్లకు సందేశం వెళ్లకపోతే, దగ్గరలోని సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. కిందిస్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 'విపత్తుల సమయంలో ముందస్తు సన్నద్ధత అవసరం. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద మంచి సాంకేతికత అందుబాటులో ఉంది. ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం నుంచి కూడా వాతావరణ హెచ్చరికలు ఇస్తుంటాం. యంత్రాంగం అప్రమత్తంగా ఉంటే నష్టనివారణ చేయగలం. ప్రతి మండలంలోని అధికారులను కలెక్టర్లు సన్నద్ధం చేయాలి' అని ఆదేశించారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను వెంటనే పునరుద్ధరించడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని సీఎం అభినందించారు.



# 5 లక్షల కొలువులకు కార్యాచరణ

**అమరావతి:** దేశంలో ఎక్కడా లేని విధంగా సంవత్సరంలో ఐదు లక్షల ఉద్యోగాలు సృష్టించేలా తమ ప్రభుత్వం వినూత్న కార్యాచరణను రూపొందిస్తోందని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పట్టభద్రులందరికీ ఒక నైపుణ్య పరీక్ష నిర్వహించి, ఫలితాల ఆధారంగా పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలనే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వెల్లడించారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల సంతృప్తిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలను సచివాలయంలో మంత్రి విలేకర్లకు వెల్లడించారు. 'ఇప్పటికే 1,000 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి నైపుణ్య పరీక్ష నిర్వహించాం. వారిలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎటువంటి శిక్షణ లేకుండా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. మిగతా పట్టభద్రులకు కొంచెం నైపుణ్య శిక్షణను అందించాలి. దానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇలాంటి పరీక్షలు నిర్వహించి, నైపుణ్యాలు కల్పించడానికి ఒక వ్యవస్థను తయారుచేస్తాం. అవసరమైతే విశ్వవిద్యాలయాలు, మంచి పేరున్న కళాశాల సమన్వయంతో ఇవన్నీ చేస్తాం.

**సేవలపై ప్రజల సంతృప్తి పెరుగుతోంది**

'ప్రభుత్వం అందిస్తున్న అనేక సేవలు, పథకాలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయి? అధికారులు ఏమైనా ఇబ్బంది పెడుతున్నారా? ఈ పథకాలు అందించడంలో ఏదైనా అవినీతి చోటు చేసుకుంటుందా.. అని సర్వే చేశాం. ప్రజల్లో ప్రతినెలా సంతృప్తస్థాయి పెరుగుతోంది. 87.8 శాతం మంది లబ్ధిదారులు తమకు ఇంటి వద్దే పింఛను అందుతోందని చెప్పారు. పింఛను అధికారి ప్రవర్తన 85 శాతం మంది బాగుందన్నారు. పింఛను అందించే అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని చాలా తక్కువ మందే చెప్పారు. అధికారుల ప్రవర్తనపై కూడా ముఖ్యమంత్రి ఆరా తీశారు. లబ్ధిదారులను సంతృప్తి పరచాల్సిన బాధ్యత వారిపై ఉందని సూచించారు. రెవెన్యూ సేవలు, హౌసింగ్ శాఖలపై ప్రజలు సంతృప్తిగానే ఉన్నట్లు సర్వేలో తేలింది' అని వివరించారు.

**మరింత మెరుగ్గా**

**వాతావరణ హెచ్చరికలు**

'విపత్తుల నిర్వహణశాఖ హెచ్చరికలను మరింత మెరుగ్గా అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నెల రోజుల్లో 30 రకాల సేవలను అందించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వాటిలో భూగర్భ జలాలు, వేడిగాలులు, వర్షపాతం, తుపానులు, పిడుగుల వంటి సమాచారాన్ని సాధ్యమైనంత కచ్చితంగా ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు' అని వివరించారు. 'వాట్సప్ గవర్నెన్స్‌లో జనవరి 30 నుంచి ఏప్రిల్ 25 వరకు దాదాపు 73.1 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 36.38 లక్షల దరఖాస్తులను పరిష్కరించాం. ప్రస్తుతం వారానికి దాదాపు 7 లక్షల దరఖాస్తులు వస్తున్నాయి. వాటిలో సగానికి పైగా పరిష్కరిస్తున్నాం' అని తెలిపారు. మద్యం విషయంలో వైకాపా ప్రభుత్వం చేసిన తప్పులన్నీ ఇప్పుడు బయటపడుతున్నాయని, దాని నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌పై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

## రైలు బోగీల్లాంటివే
# రిజర్వేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) రిజర్వేషన్లకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు చివరిసారిగా 2016-17లో జరిగాయి. ఓబీసీ కోటాకు సంబంధించిన న్యాయ పోరాటం కారణంగానే ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 2021లో, ఓబీసీలకు 27 శాతం కోటా అమలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనంపై కచ్చితమైన గణాంకాల సేకరణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు, కమిషన్ సిఫార్సుల మేరకు రిజర్వేషన్ల శాతం నిర్ధారణ, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ రిజర్వేషన్లు మొత్తం 50 శాతానికి మించరాదనే త్రివిధ సూత్రాన్ని అత్యున్నత న్యాయస్థానం నిర్దేశించింది. అప్పటి నుంచి గణాంకాల సేకరణ, సంబంధిత వ్యాజ్యాల వల్ల ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగడం లేదన్నారు. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది ఇందిరా జైసింగ్, ఓబీసీలను గుర్తించినప్పటికీ, ఆ డేటాను స్థానిక ఎన్నికలకు మహారాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించడం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు.

## మే 7 నుంచి కొత్త రేషన్‌కార్డులకు
# దరఖాస్తుల స్వీకరణ

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరణ ఉంటుంది. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి పౌరులు తమ వివరాలు తెలుసుకోవచ్చు. జూన్ నుంచే స్మార్ట్ కార్డులు జారీ అవుతాయి. ప్రస్తుతం 95 శాతం మేర ఈ కేవైసీ పూర్తి అయింది. ఈకేవైసీ పూర్తి అయిన వారు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ నెల 12 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం''అని తెలిపారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులందరికీ పంట నష్ట పరిహారం అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు 1.50 కోట్ల మందికి దీపం పథకం ద్వారా లబ్ధి కలిగిందన్నారు. పాఠశాలలకు 25 కేజీల ఫైన్ క్వాలిటీ రైస్ ఈ ఏడాది నుంచి సరఫరా చేయబోతున్నామని వెల్లడించారు.

# ఆ వరుడికి లెక్కలేనన్ని కట్నకానుకలు

రాజస్థాన్ లోని నాగౌర్ జిల్లాలో జరిగిన ఒక పెండ్లిలో వరుడికి అత్తగారు లెక్కలేనన్ని కట్నకానుకలు ఇచ్చిన ఎపిసోడ్ ఒకటి సోషల్ మీడియాలో బాగా హల్‌చల్ చేస్తోంది.

ఆ రాష్ట్రంలో ఒక సంప్రదాయం ప్రకారం.. పెళ్లికి ముందు జరిగే ఒక వేడుకలో పుట్టింటి వారు ఆడపిల్లలకు రకరకాల బహుమతులు ఇస్తుంటారు. అలా నాగౌర్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం కేజీ బంగారం, 15 కేజీల వెండి, సుమారు 130 ఎకరాల భూమి (210 బిగాలు), పెట్రోల్ బంక్, అజ్మేర్ లో స్థలం, రూ.1.51 కోట్ల నగదు, వాహనాలు, వస్త్రాలు వంటి వాటిని తమ కుమార్తెకు అందజేసింది. బంధువులు ఇచ్చిన కానుకలు చదివి వినిపించిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. సుమారు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు వాటి విలువ ఉండొచ్చని తెలుస్తోంది.ఆ వివాహానికి పెద్ద ఊరేగింపులా వచ్చిన వధువు బంధువులు.. నాలుగు సూట్ కేసుల్లో బహుమతులు తీసుకువచ్చారు. 100 కార్లు, నాలుగు లగ్జరీ బస్సుల్లో వచ్చి ఈ బహుమతులు అందజేశారు. ఇదంతా రాజకుటుంబ పరేడ్ లా అనిపించిందని స్థానికులు వెల్లడించారు. అలాగే వివాహానికి వచ్చిన వారికి వెండి నాణేలు పంచారు. ఇటీవల జరిగినట్టుగా తెలుస్తోన్న పెళ్లి తంతులో ఎంతవరకు వాస్తవముందనేది తెలియాల్సి ఉంది.

# ఎఫ్ఏటీఎఫ్ లో పాక్ కు సెగ

(మొదటి పేజీ తరువాయి)

ఊరట పొందింది. తనను ఆర్థికంగా దెబ్బతీయడానికి పాక్ టెర్రర్ ఫైనాన్సింగ్, మనీలాండరింగ్ కుసహకరించిందన్న ఆధారాలు భారత్ వద్ద ఉన్నట్లు ఎఫ్ఏటీఎఫ్ లో గతంలో పాల్గొన్న ఓ అధికారి తెలిపారు. వాటిని ప్రపంచ వేదికపై అవసరమైనప్పుడు బయటపెట్టాలన్నారు. రానున్న రోజుల్లో పాకిస్తాన్ కు ఆర్థిక ప్యాకేజీ పై ఐఎంఎఫ్ (అంతర్జాతీయ ద్రవ్యనిధి) బోర్డ్ సమావేశంలో కూడా భారత్ ఈ అంశాన్ని లేవనెత్తనుంది. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్తాన్ ఆర్థిక ప్యాకేజీని ఇవ్వడాన్ని భారత్ వ్యతిరేకించనుంది. ''ఐఎంఎఫ్ బోర్డు, ఎఫ్ఏటీఎఫ్ ఎదుట పెట్టేందుకు ఇప్పటికే ఆధారాలు సేకరించాము. ఉగ్రవాదానికి మద్దతు, ఆశ్రయం ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సంస్థల నుంచి నిధులు వెళ్లకూడదన్న అంశంపై భారత్ గట్టిగా నిలబడనుంది'' అని ఓ అధికారి వెల్లడించారు.

# వేగంగా కట్టమంచి చెరువు పూడికతీత, సుందరకరణ పనులు

- జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**చిత్తూరు, మే 06 మనం న్యూస్:** చిత్తూరు కట్టమంచి చెరువులో జరుగుతున్న పూడికతీత, సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ ఎస్ అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, ఇరిగేషన్ అధికారులతో కలిసి కట్టమంచి చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. కట్టమంచి చెరువు గట్టు పటిష్ట పరచడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. వర్షాకాలం ముందుగానే పూడికతీత పనులు పూర్తి చేయడానికి వీలుగా పనులు వేగంగా చేపట్టాలని మంత్రి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పూడికతీత పనులు జరుగుతున్న తీరు ఎమ్మెల్యే మంత్రిగారికి వివరించారు. అనంతరం మంత్రి,ఎమ్మెల్యే గాంధీ రోడ్డు ను పరిశీలించారు. రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టాలని నగర కమిషనర్ ను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, ఇతర నాయకులు, ఇరిగేషన్, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

# భారత్-బ్రిటన్ మధ్య

(మొదటి పేజీ తరువాయి)

దీన్ని 20 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒప్పందంలో భాగంగా భారత్ నుంచి ఎగుమతయ్యే 99 శాతం ఉత్పత్తులకు జీరో టారిఫ్ వర్తిస్తుంది. అలాగే, బ్రిటన్ నుంచి భారత్కు దిగుమతయ్యే విస్కీపై సుంకం 150 శాతం నుంచి 75 శాతానికి తగ్గనుంది. నిర్దేశిత కోటా మేరకు ఆటోమొబైల్ దిగుమతుల సుంకం 100 శాతం నుంచి 10 శాతానికి తగ్గనుంది. వీటితో పాటు వైద్య పరికరాలు, అధునాతన మెషినరీ పరికరాలు, చాక్లెట్లు, బిస్కెట్లపై టారిఫ్లను భారత్ తగ్గించనుంది. అలాగే, సామాజిక భద్రత ఒప్పందంలో భాగంగా బ్రిటన్లో పనిచేసే భారతీయులు సోషల్ సెక్యూరిటీ ఫండ్స్ కింద రెట్టింపు చెల్లింపు చేయాల్సిన అవసరం ఇక నుంచి ఉండదు.

## 'గోల్డెన్ అవర్'లో
# ఉచిత వైద్యం

**రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్-2025 పేరుతో కేంద్ర పథకం**

**బాధితులకు రూ.1.50 లక్షల వరకు ట్రీట్‌మెంట్**

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచితంగా వైద్య చికిత్స అందించే పథకాన్ని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర రహదారుల రవాణా మంత్రిత్వ శాఖ ఒక అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పథకం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు గత జనవరిలో వెలువరించిన తీర్పు ఈ నిర్ణయానికి మూలంగా నిలిచింది. రోడ్డు ప్రమాద బాధితులకు 'గోల్డెన్ అవర్' (ప్రమాదం జరిగిన మొదటి గంట)లో ఉచిత వైద్యం అందించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీం-2025' పేరుతో ఈ పథకానికి రూపకల్పన చేసింది. ఈ పథకం కింద, మోటారు వాహనం వల్ల ఏ రహదారిపై ప్రమాదం జరిగినా బాధితులు ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు పొందేందుకు అర్హులవుతారు. ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా 7 రోజుల పాటు ఈ ఉచిత చికిత్సను పొందవచ్చు.




ట్రామా, పాలీట్రామా వంటి అత్యవసర సేవలు అందించగల సామర్థ్యం ఉన్న అన్ని ఆసుపత్రులను ఈ పథకం పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకువచ్చిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాలని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఒకవేళ సంబంధిత ఆసుపత్రిలో అవసరమైన సౌకర్యాలు లేకపోతే, తక్షణమే మరో ఆసుపత్రికి తరలించాల్సి ఉంటుంది. ఇందుకోసం రవాణా సౌకర్యాలను కూడా ఆ ఆసుపత్రి కల్పించాలని పేర్కొంది.

## సాంప్రదాయబద్ధంగా
# స్వాగతం పలకాలె

**తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడేలా విమానాశ్రయాన్ని అలంకరించాలె**

**ఎయిర్‌పోర్టులో అందాల పోటీల అతిథుల స్వాగత ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**




**హైదరాబాద్, మే 6:** మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చే అతిథులకు విమానాశ్రయంలో తెలంగాణ సాంప్రదాయ పద్ధతిలో ఆహ్వానం పలకాలని, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం శంషాబాద్ విమానాశ్రయాన్ని సందర్శించి, స్వాగత సత్కారాల ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. పర్యాటక శాఖ, కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, సీఐఎస్ఎఫ్ అధికారులతో సమీక్షించారు. విమానాశ్రయాన్ని మరింత అందంగా ముస్తాబు చేయాలని, పూలు, మామిడి, అరటి తోరణాలతో సుందరంగా అలంకరించాలని సూచించారు. ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ క్లియరెన్స్ ను త్వరగా పూర్తి చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో ఎయిర్ పోర్ట్ కు విచ్చేసిన మిస్ ఇండియా నందిని గుప్తా, మిస్ మెక్సికో మార్లే లీల్ సర్వాంతేస్ తో భేటీ అయ్యారు. తెలంగాణలోని వారసత్వ, చారిత్రక కట్టడాలను సందర్శించాలని వారిని కోరారు.



# గాలికి ఏడేండ్ల జైలు శిక్ష

- ఓబుళాపురం మైనింగ్ కేసులో తీర్పు వెలువరించిన సీబీఐ కోర్టు
- ప్రధాన నిందితుడు గాలి జనార్ధన్ రెడ్డితో పాటు మరో ముగ్గురికి ఏడేండ్ల జైలు, రూ. 10 వేల జరిమానా
- గనుల శాఖ నాటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌కు 11 ఏండ్లు
- అప్పటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని నిర్దోషిగా ప్రకటించిన కోర్టు

**హైదరాబాద్, మే 6:** ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ప్రధాన నిందితులైనగాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్ ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష ఖరారు చేసింది.దోషులకు రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ.2 లక్షలు జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.

**రాజగోపాల్‌కు మరో నాలుగేండ్లు..**

ఈ కేసులో వీడీ రాజగోపాల్ కు అదనంగా మరో నాలుగేళ్లు జైలు శిక్ష విధించింది. భూగర్భ గనుల శాఖ డైరెక్టర్గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను ఖరారు చేసింది. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అక్రమాలకు పాల్పడినందున మొత్తంగా 11 ఏళ్ల పాటు అతడికి జైలు శిక్ష పడింది.

# రాష్ట్రంలో తిరుపతి జిల్లా స్థూల జాతీయోత్పత్తిలో మొదటి స్థానానికి వచ్చేలా కృషి చేయాలి

- **స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఇన్చార్జ్ జోనల్ ఆఫీసర్ ఎం.టి కృష్ణ బాబు సూచన**

**తిరుపతి, మే 6 మనం న్యూస్ :** రాష్ట్రంలో తిరుపతి జిల్లా స్థూల జాతీయోత్పత్తి లో మూడవ స్థానంలో ఉంది రాబోయే రోజుల్లో మొదటి స్థానానికి వచ్చేలా కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు ఇన్చార్జ్ జోనల్ ఆఫీసర్ ఎం.టి కృష్ణ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా సమగ్ర అభివృద్ధికి సంబంధించిన వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల అమలుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు జోనల్ ఇంచార్జ్ అధికారి ఎం టి కృష్ణ బాబు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో తిరుపతి జిల్లా స్థూల జాతీయోత్పత్తి లో మూడవ స్థానంలో ఉంది రాబోయే రోజుల్లో మొదటి స్థానానికి వచ్చేలా సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన పారిశ్రామికవేత్తలకు మన జిల్లాలో ఉన్న వనరులు, అవకాశాల గురించి తెలియజేసి పరిశ్రమలు నెలకొల్పేలా ఆకట్టుకోవాలన్నారు. మన జిల్లాలో హోటల్ టూరిజం, మెడికల్ టూరిజం కేరళ తరహాలో మన జిల్లాలో కూడా నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయి కాబట్టి ఆ దిశగా తిరుపతి జిల్లాలో కూడా మెడికల్ టూరిజం ను తిరుపతి జిల్లాలో అభివృద్ధి పరిచేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఆకాంక్షించారు. ముఖ్యంగా తిరుపతి జిల్లాలో




మెడికల్ టూరిజం, లీజర్ టూరిజం, స్పిరిచ్యువల్ టూరిజం అభివృద్ధి చేయాలని గౌరవ ముఖ్యమంత్రి గారు ఆకాంక్షిస్తున్నారని అన్నారు. సోలార్ ప్రాజెక్టుకు సంబంధించి ఎస్.సి, ఎస్.టి వారు లబ్ధి పొందేలా చూడాలని తెలిపారు.

జిల్లాలో పరిశ్రమలకు అనుగుణంగా అధునాతన నైపుణ్య శిక్షణ ఇచ్చి నైపుణ్య అభివృద్ధిని పెంచుకునేలా మెలకువలను పాటించాలని తెలిపారు. పరిశ్రమలకు తగ్గ మ్యాన్ పవర్ ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. హార్వెస్టింగ్ అనే అధునాతన సాంకేతికను ఉపయోగించి పంట దిగుబడి లో అధునాతన పద్ధతులను పాటిస్తూ పంట దిగుబడులను పెంచుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ చీఫ్ సెక్రటరీ వారు ఇచ్చిన సలహాలను తప్పకుండా పాటిస్తు, ముఖ్యమంత్రి గారి ఆకాంక్ష మేరకు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేలా జిల్లా యంత్రాంగం అహర్నిశలు కృషి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా అధికారులు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని. అనుకున్న సమయంలోపు లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో పరిశ్రమలు ఇంకా అభివృద్ధి చెందాలంటే చాలా అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని జిల్లాను అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిపేలా చూడాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నరసింహులు, మునిసిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ట్రైన్ ని కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, సూళ్లూరుపేట, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డిఓలు కిరణ్మయి, రామ్మోహన్ రెడ్డి, భాను ప్రకాశ్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణ దిశగా మరిన్ని అవగాహన కార్యక్రమాలు

- **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం టి కృష్ణబాబు**

**తిరుపతి, మే 6 మనం న్యూస్:** క్యాన్సర్ నివారణ దిశగా ప్రతి ఒక్కరికి అవగాహన, ఎన్ సి డి సర్వే ప్రక్రియలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు జోనల్ ఇన్చార్జ్




అధికారి ఎం టి కృష్ణబాబు తెలిపారు. మంగళవారం తనపల్లెలోని స్వయం సహాయక సంఘాల భవనాన్ని, సచివాలయం ను రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ ఆఫీసర్ మరియు జోనల్ ఇన్చార్జి అధికారి ఎం. టి కృష్ణబాబు, కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు జోనర్ ఇన్చార్జి అధికారి మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలు రుణాలను సంబంధించిన అంశాలు కాకుండా ఆరోగ్యపరమైన అంశాలపై కూడా సమావేశంలో చర్చించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులే కాకుండా వైద్య సిబ్బంది కూడా హాజరై ఆరోగ్యపర అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. సీజన్ వ్యాధులు, గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు వంటి విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ వారు అందజేస్తున్న కిట్స్ ను సద్వినియోగం చేసుకునేలా ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్ఎం లు, ఎన్ సి డి లు సర్వే ప్రక్రియలో చేస్తున్నటువంటి బీపీ షుగర్ థైరాయిడ్ వంటి వ్యాధులకు సంబంధించి సరైన డేటా తీసుకుంటున్నారో లేదో అని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఎన్ సి డి సర్వే ప్రతి మనిషి యొక్క బేసిక్ ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకోవడం కోసమేనని, కావున వైద్య సిబ్బందికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. రక్తహీనత నివారణ దిశగా ఐరన్ మాత్రలు రెగ్యులర్ గా అందేలా చూడాలని తెలిపారు. క్యాన్సర్ నివారణ దిశగా అవగాహన కల్పించడంతో పాటు పొగాకు, సిగరెట్ వంటి హానికర మత్తు పదార్థాలు వాడడం వలన జరిగే నష్టం కూడా ప్రజలకు తెలియజేయన్నారు. ప్రారంభ దశలోని క్యాన్సర్ ను గుర్తించి నివారణ దిశగా ..జిల్లాలో మరెన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలనీ అన్నారు. అనంతరం స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు జోనల్ ఇన్చార్జి తనపల్లి సచివాలయం తనిఖీ చేసి సచివాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ సచివాలయం సిబ్బంది అందిస్తున్నటువంటి సేవలను ఆరా తీశారు. 4 సర్వే పక్రియ మరియు గుర్తించిన డేటా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్య పరిష్కార దిశగా కృషిచేయాలని సచివాల సిబ్బందినీ ఆదేశించారు. పెన్షన్ పంపిణీ, హౌసింగ్, రీసర్వే, తదితరు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. గత రిసర్వే లో ఉన్న దొర్లిన తప్పులను సరిదిద్దేలా పక్కా గా మళ్ళీ రిసర్వే చేపడుతున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ ఆఫీసర్ మరియు జోనల్ ఇన్చార్జి అధికారి కి తెలిపారు. జిల్లాలో క్యాన్సర్ నివారణ దిశగా అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలియజేశారు. అందులో భాగంగా ఎన్ సి డి సర్వే ద్వారా కూడా ప్రజలకు క్యాన్సర్ పట్ల అవగాహన తో పాటు నివారణ మార్గాలను వైద్య సిబ్బంది తెలియ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, మహిళా సంఘాల సభ్యులు, ఏఎన్ఎం లు, ఆశ వర్కర్లు, సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 8వ జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి

- **స్కూటర్ ర్యాలీ నిర్వహించిన సిపిఎం నేతలు**

**తిరుపతి, మే 6 మనం న్యూస్:** ఈనెల 8 9 10 తేదీలలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా జరిగేటటువంటి బహిరంగ సభను జయప్రదం చేయాలని నేడు మంగళవారం ఉదయం 10 నుండి 11:30 గంటల వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ స్కూటర్ ర్యాలీ పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమై నాలుగు కాళ్ల మండపం అంబేద్కర్ విగ్రహం రైల్వే స్టేషన్ మీదుగా కారణాల వీధి గాంధీ రోడ్ జ్యోతిరావు పూలే విగ్రహం మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ డీకే స్ట్రీట్ భవాని నగర్ కెటి రోడ్డు మీదుగా యశోద నగర్ లోని సిపిఎం కార్యాలయం చేరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సిపిఎం కు భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు నిర్వహించుకునేందుకు రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా



వ్యతిరేక విధానాన్ని తిప్పి కొట్టడం కోసం ఈ ౹ావేశంలో చర్చించి పోరాటాలను రూపకల్పన చేయబోతున్నామని అన్నారు. ప్రపంచ ప్రతిష్టను అర్జించిన తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల సౌకర్యాలను మెరుగుదల నుంచి కాంట్రాక్ట్ కార్మికుల కష్టాల పరిష్కారం వరకు అనేకంశాల మీద నిరంతరం పోరాడుతూ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి భక్తులు కార్మికులు ఉద్యోగుల పక్షాన తిరుపతి తిరుమల ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం తిరుపతికి టీటీడీ నిధులు వినియోగించాలని 30 సంవత్సరాలుగా ప్రజల తరపున పోరాడుతున్నదని అన్నారు. మానవసేవే మాధవసేవ అన్న నానుడి అనుసరించి ఆధ్యాత్మిక వ్యవహారాలతో పాటు టీటీడీ లాంటి సంస్థలు విద్యా వైద్య సామాజిక అంశాలు జోక్యం చేసుకొని తోడ్పడాలని గత వారసత్వాన్ని కొనసాగించాలని టిటిడి కి విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. తిరుపతి కేంద్రంగా మత చిచ్చు రగల్చడానికి ప్రయత్నం చేసిన మతోన్మాద శక్తులను బిజెపి అనుకూల సంస్థలను ఎదుర్కొని టీటీడీ పరిరక్షణ కొరకు పనిచేసింది ప్రజలతో శాంతియుత వాతావరణం కాపాడింది టీటీడీ విద్యా వైద్య సంస్థలో మత ప్రాతిపదికన నియామకరణం వ్యతిరేకించింది సిపిఎం అని అన్నారు.

ఈ రాష్ట్ర సమావేశాలకు సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎంఏ బేబీ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బి.వి రాఘవులు రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావులు తో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి నాయకులు సమావేశంలో పాల్గొంటున్నారని ఈ సమావేశాలకు వేదికగా తిరుపతి నగరం ప్రాతినిధ్యం ఇస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి సుబ్రమణ్యం కే వేణుగోపాల్ ఎస్ జై చంద్ర సాయి లక్ష్మి మాధవ కృష్ణా పి బుజ్జి పి చిన్న ఎం నరేంద్ర ఆర్ మల్లికార్జునరావు వి ప్రభాకర్ పి రమేష్ ఏ రాధాకృష్ణ ఎన్ డి శ్రీనివాసులు వాసు సుజాతమ్మ నారాయణస్వామి శ్రీరాములు సాయి ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- **మే 11 నుండి 13వ తేదీ వరకు వసంతోత్సవాలు**

**తిరుపతి, మే 6 మనం న్యూస్:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు



కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మే 11 నుండి 13వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు జరుగనున్నాయి. ఇందుకోసం మే 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. భక్తులు ఒక్కొక్కరు రూ.150/- చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు.

ఉత్సవాల్లో భాగంగా మే 12వ తేదీ ఉదయం 9.45 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

ఈ ఉత్సవాల కారణంగా మే 11 నుండి 13వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవను టీటీడీ రద్దు చేసింది.

ఈ కార్యక్రమంలో టిటిడి ఆలయ అర్చకులు బాబు స్వామి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ జి.రమేష్, ఆలయ ఇన్స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు, ప్రసాద్, ఏవీఎస్వో జి.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో వైభవంగా శ్రీ పద్మావతీ పరిణయోత్సవాలు ప్రారంభం



- **భూలోక వైకుంఠాన్ని తలపించిన ' దశావతార - అష్టలక్ష్మి మండపం'**

**తిరుమల, మే 6 మనం న్యూస్ :** తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో వివిధ సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో భూలోక వైకుంఠాన్ని తలపించే రీతిలో అలంకరించిన '' దశావతార - అష్టలక్ష్మి '' మండపంలో మంగళవారం సాయంత్రం శ్రీ పద్మావతి శ్రీనివాస పరిణయోత్సవాలు శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. మే 8వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఒక టన్ను పండ్లు, 2 టన్నుల సాంప్రదాయ పుష్పాలు, 30 వేల కట్ ఫ్లవర్స్ తో 150 మంది గార్డెన్ సిబ్బంది, 50 మంది ఎలక్ట్రిక్ సిబ్బంది కలిసి మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

**మొదటిరోజు వైశిష్ట్యం :**

శ్రీ పద్మావతి పరిణయోత్సవాల్లో మొదటిరోజు అంటే వైశాఖశుద్ధ నవమిరోజైన మంగళవారంనాడు శ్రీ మలయప్ప స్వామివారు గజవాహనాన్ని అధిరోహించగా ఉభయనాంచారులు పల్లకిపై పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేశారు.

వివిధ హంగులతో శోభిల్లుతున్న ఈ పెండ్లిమండపంలో నిత్య నూతన వధూవరులైన శ్రీ స్వామివారికి, అమ్మవార్లకు ఎదుర్కోలు, మాల పరివర్తనం, పూలబంతులాట, నూతన వస్త్ర సమర్పణ కోలాహలంగా జరిగాయి. ఆ తరువాత శ్రీ స్వామివారికి కొలువు (ఆస్థానం) జరిగింది. ఈ క్రతువుల అనంతరం చతుర్వేద పారాయణం, మలహారి, దేశిక, సౌరాష్ట్ర, వారహి, కదన కుతూహల, నీలంబారి వంటి వివిధ రాగ-తాళ-వాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పిదప ఆర్జిత భక్తులకు వస్త్ర బహుమానం, ప్రసాద వితరణ జరిగింది. ఆ తరువాత శ్రీదేవి భూదేవి సహితుడైన స్వామి అశేష భక్తజనం మధ్య ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేయడంతో తొలిరోజు వివాహ వేడుక ఘనంగా ముగిసింది.

ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు, బోర్డు సభ్యులు శ్రీమతి పనబాక లక్ష్మీ, అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, పేష్కార్ శ్రీ రామకృష్ణ, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తిరుమలలో గెస్ట్ హౌస్ లకు పేర్లు మార్పు


**తిరుమల, మే 6, మనం న్యూస్:** కలియుగ వైకుంఠం తిరుమలలో ఆధ్యాత్మికశోభ ఉట్టిపడేలా మరో కీలక నిర్ణయం తీసుకుంది టీటీడీ పాలకమండలి. ఇందులో భాగంగా తిరుమలలో ఉన్న పలు గెస్ట్ హౌస్ లకు పేర్లు మార్చింది టీటీడీ, పలు గెస్ట్ హౌస్ లకు దాతలు తమ సొంత పేర్లను పెట్టుకున్న క్రమంలో ఈ నిర్ణయం తీసుకుంది. తిరుమలలో ఏదైనా భగవంతుని పేరుతోనే ఉండాలని.. గోవిందనామ స్మరణ మాత్రమే వినపడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. తిరుమలలో దాతలు నిర్మించి టీటీడీకి ఇచ్చిన గెస్ట్ హౌస్ లలో 42 భవనాలకు దాతల సొంత పేర్లు ఉన్నాయని.. వెంటనే వాటిని మార్చాలని గత ఏడాది




డిసెంబర్ 24న జరిగిన పాలకమండలి నిర్ణయం తీసుకుంది. భగవంతుడికి సంభందించి 150 పేర్లను సూచించి, వాటిలో ఎదైనా ఒకటి గెస్ట్ హౌస్ కు పేరుగా పెట్టుకోవాలని అదేశించింది టీటీడీ వికాస్ నిలయం పేరు వైష్ణవి సదనంగా.. వెంకట కళా నిలయం పేరును వేంకటకళా నిలయంగా మార్చారు. జిఎంఆర్ విశ్రాంతి భవనానికి ఆనంద నికేతనం, మాగుంట నిలయంకు రాఘవ నిలయం, మైహోమ్ పద్మాప్రియ గెస్ట్ హౌస్ కు పద్మాప్రియ నిలయం, సుధాకృష్ణ నిలయంకు వైకుంఠ నిలయం, పాండవ విశ్రాంతి భవనం కు విరజా నిలయంగా పేర్లు మార్చారు దాతలు.ఇక మీదట నిర్మాణాలు జరిగే ఏ బిల్డింగ్ కి అయినా... భగవంతుడి పేరు మాత్రమే ఉండాలని సూచిచింది టీటీడీ. పేర్లు మార్చడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తుంది.

# నేడు టిటిడి పాలక మండలి అత్యవసర సమావేశం

**తిరుమల, మే 6 మనం న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సమావేశం బుధవారం ఉదయం తిరుమలలోని అన్నమయ్య భవన్లో జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు అత్యవసరంగా బోర్డు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచారం. తిరుపతిలోని అలిపిరి ప్రాంతంలో ముంతాజ్ హోటల్కు



కేటాయించిన స్థలాన్ని రద్దుచేసి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించేందుకు పాలకమండలిలో ప్రధాన అజెండాగా చేర్చనున్నారు. ప్రధాన రహదారికి అటువైపునున్న 20 ఎకరాల స్థలాన్ని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతోపాటుగా శ్రీవారి భక్తుల సౌకర్యార్థం తిరుపతి రైల్వే స్టేషన్ ఆర్టీసి బస్టాండ్ ల నుండి శ్రీవారి మెట్టు మార్గానికి ఉచితంగా టీటీడీ ఎలక్ట్రికల్ బస్సులను నడిపేందుకు నిర్ణయించిన నేపథ్యంలో సుమారు 20 ఎలక్ట్రికల్ బస్సులను టిటిడి కి తెప్పించేందుకు పాలకమండలిలో ఆమోదం తెలుపనున్నారు. దీంతోపాటు మరో రెండు అంశాలను అజెండాగా సమావేశంలో చర్చించేందుకు వెంటనే సమావేశానికి హాజరు కావలసిందిగా టిటిడి పాలకమండలి సభ్యులకు అత్యవసర సమాచారం అందించారు. తిరుమలకు రావడానికి వీలు లేని పరిస్థితుల్లో పాలకమండలి సభ్యులు ఆన్లైన్ జూమ్ విధానంలో పాలకమండలి సమావేశంలో పాల్గొనాలని సూచించారు. ఈనెల 8వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశం కానున్న సందర్భంగా టిటిడి బోర్డు ప్రధాన అంశాలపై క్యాబినెట్లో చర్చించాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో ఈ అత్యవసర పాలకమండలి సమావేశంలో ఆమోదముద్ర వేయనున్నారు.

# తిరుపతి రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణ పురోగతిపై ఎంపీ గురుమూర్తి సమీక్ష


- **త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచన**

**తిరుపతి, మే 6 మనం న్యూస్:** తిరుపతి రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి గత ప్రభుత్వ హయాంలో కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.12.23 కోట్లతో పట్టణంలోని ప్రధాన ప్రాంతాలయిన హీరో హోండా షోరూం వద్ద ఎల్.సి-107, రైల్వే సి.ఆర్.ఎస్ వద్ద ఉన్న ఎల్.సి-109 అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి అంగీకారం తెలుపుతూ అప్పట్లోనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. విదానపరమైన అనుమతులు పూర్తి కావడంతో ఎట్టకేలకు పనులు మొదలయ్యాయి. ఇదిలా ఉండగా తిరుపతి ఎంపీ డా. మద్దిల గురుమూర్తి సోమవారం పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ



వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చూడాలని రైల్వే ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైల్వే లైన్ కి ఇరువైపులా పట్టణం విస్తరించి ఉండటంతో రైల్వే గేట్ల సమీపంలో వాహన చోదకుల ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతమనీ ఆయన అన్నారు. అండర్ బ్రిడ్జిల నిర్మాణంతో తిరుపతి ట్రాఫిక్ సమస్యలకు త్వరలో పరిష్కారం లబిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఇంజనీరింగ్ విభాగం అదికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అలంకరణల బంధాలు



రాజకుమారవస్త్రధారణతో
కంఠం చుట్టూ అమూల్యరత్నమణిహారాలతో
అలంకరింపబడిన ఆ బాలకుమారుడు
తన ఆటలో సహజానందాన్ని కోల్పోతాడు
ఎందుకంటే...
అతని ఆడంబరప్రదర్శకవస్త్రాలు
అతడిని అడుగడుగునా అడ్డుకుంటాయి!

అడుగువేస్తే వస్త్రాలు
ఎక్కడ మడతబడి పాడవుతాయేమోననీ
అసలు కదలడానికే భయపడుతూ
తనకు తానే ఈ ప్రపంచానికి దూరంగా
ఉండిపోతాడు!

అమ్మా!నీ కొడుకుకు నీవు అలంకరించిన
సొగసుల విశేషభూషణాల బంధాలు-
ఈ ఆరోగ్యసంభరితమైన భూధూళి నుండి
దూరంగా ఉంచేవే అయితే,

ఈ బంధాలు-
సామాన్యమానవజీవన మనే
గొప్ప వేడుకలోకి ప్రవేశించి పాల్గొనే హక్కును
దోచుకునేవే అయితే
సుంతైనా లాభం లేదమ్మా!!!

ఆంగ్లమూలం: **రవీంద్రనాథ్ ఠాగూర్**
స్వేచ్ఛాకవితానువాదం: **-'రఘువర్మ'**
9290093933

# విశ్వకవిగా ఎదిగిన సహజ కవి




అనితర సాధ్యమైన ప్రతిభతో, సహజసిద్ధమైన వాతావరణంలో పెరిగి, తనకు నచ్చిన విధంగా తనను తాను తీర్చుదిద్దుకుంటూ ప్రకృతి ఒడిలో పాఠాలు నేర్చుకుని జనం మెచ్చే విధంగా కవితలు వ్రాసి, రచనలు చేసి విశ్వకవిగా వినువీధుల్లో భారతీయ కీర్తి పతాకాన్ని సగర్వంగా ఎగరేసిన రవీంద్రుని అపార మేధస్సును ప్రశంసించడానికి ఉపమానాలు చాలవు.సాహితీ వినీలాకాశంలో కీర్తి పతాకం మన విశ్వకవి రవీంద్ర నాథ్ టాగోర్. ఒక కలం,ఒక గళం,ఒక పదమై, ఒక పాటై,ఒక సంగీతమై, కవిత్వమై,రచనా వ్యాసంగమై కేవలం వంగ భూమినే కాకుండా యావత్ భారతాన్ని, ప్రపంచాన్ని అలరించింది. రవీంద్రనాథ్ టాగోర్‌ను సాహితీ వినీలాకాశంలో ధృవతారగా నిలబెట్టింది.విశ్వకవిగా పేరుగడించిన రవీంద్ర నాథ్ టాగోర్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించాడు. కవిగా, రచయితగా, సంఘసంస్కర్తగా బహుముఖ పాత్ర పోషించాడు. అనితర సాధ్యమైన ప్రజ్ఞాపాటవాన్ని ప్రదర్శించాడు. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా గళమెత్తాడు. బెంగాల్ పునరుజ్జీవన ఉద్యమంలో కీలక భూమిక పోషించాడు. భారతదేశానికి అర్ధవంతమైన జాతీయ గీతం 'జనగణమన..' రచించాడు. బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని కూడా రవీంద్రుడు రచించాడు. ఎక్కడ ప్రతిభ ఉన్నా గుర్తించి గౌరవించడం వలన మన గొప్పదనం ప్రస్ఫుటమవుతుంది. మన వ్యక్తిత్వం సమాజానికి అవగతమవుతుంది. దురదృష్ట వశాత్తూ ఇలాంటి లక్షణాలు వర్తమాన సమాజంలో మచ్చుకైనా కానరావు. ప్రజ్ఞాపాటవాలు స్వయం కృషితో మాత్రమే సిద్దిస్తాయి. ఆసక్తి,పట్టుదల వలన అనితర సాధ్యమైన ప్రతిభ స్వంత మవుతుంది. ఎలాంటి కృషి లేకుండా వడ్డించిన విస్తరిలా ప్రతిభ మన ముంగిట వాలదు. ప్రతిభను ప్రపంచానికి వెల్లడి కాకుండా అడ్డుకోవడం వలన అంతిమంగా నష్టమే వాటిల్లుతుంది. ఇతరులలోని ప్రతిభను గుర్తించి,ప్రోత్సహించడం వలన సమాజానికి మేలు జరుగుతుంది. ప్రతిభకు ఎల్లలు లేవు. భాషాబేధాలు అడ్డురావని విశ్వకవి రవీంద్ర నాథ్ టాగోర్ నిరూపించాడు. బెంగాలీ భాష పట్ల అమితమైన అభిమానమున్నా, ఇతర భాషల్లోని సాహిత్యాన్ని ఆస్వాదించి, అభినందించి, భారతదేశాన్ని ప్రపంచ సాహితీ రంగంలో అగ్రపథంలో నిలిపిన రవీంద్రుడు విశ్వకవిగా విశేష ఖ్యాతి నార్జించాడు. రవి గాంచని చోటును కవి గాంచునన్న నానుడిని నిజం చేసిన రవీంద్రుని ప్రతిభ అనన్య సామాన్యం. తన ఆలోచనలను కవిత్వీకరించి పాశ్చాత్య ప్రపంచానికి సైతం అందించిన ఘనత రవీంద్రునిదే.

రవీంద్రుని బాల్యమంతా దాదాపుగా ఒంటరిగానే గడిచింది. సహజ మైన విద్యకు అలవాటు పడ్డ రవీంద్రుడు స్వేచ్ఛయుతమైన,జ్ఞాన సంపన్నమైన,భయం లేని నూతన ప్రపంచం కోసం పరితపించాడు.ప్రముఖుల రచనలను చదివాడు.ఆంగ్ల సాహిత్యంపై అభిలాష పెంచుకుని,సాహితీ ప్రసంగాలను ఆకళింపు చేసుకుని, ఎన్నో మనోరంజకమైన రచనలకు శ్రీకారం చుట్టి జనహృదయాలను రంజింపచేసాడు.తన దైన శైలితో సాహితీ ప్రపంచాన్ని అలరించాడు. బాల్యంలోనే ఒక మంచి కవిగా,రచయితగా పేరు గడించాడు. విమర్శకుల ప్రశంసలు పొందాడు.శాంతి నికేతన్ ను స్థాపించి, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాడు. గురువులకు, విద్యార్థులకు మధ్య అవ్యాజ్యమైన ఆత్మీయతలతో కూడిన వాతావరణాన్ని సృష్టించాడు.సాహిత్యం పట్ల,కళల పట్ల విద్యార్థులకు మక్కువ కలిగించాడు. రవీంద్ర నాథ్ టాగోర్ 'గీతాంజలి' విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. సాహిత్యంలో నోబెల్ బహుమతిని సంపాదించి పెట్టింది. భారతదేశం లోనే కాదు ఆసియాలో తొలి నోబెల్ బహుమతి గ్రహీతగా రవీంద్రునికి అవకాశం దక్కింది.'గీతాంజలి' రవీంద్రుని సాహితీ వనంలో విరబూసిన మనోహరమైన కవితాకుసుమం. రవీంద్రుని కావ్య శైలికి, సహజత్వానికి,చైతన్యవంతమైన, అర్ధవంతమైన ప్రపంచ నిర్మాణానికి'గీతాంజలి' ఒక మచ్చుతునక. భయం నుంచి జ్ఞానం లోకి నడిపించాలని వాంఛిస్తూ,తలెత్తుకుని తిరిగే ఆత్మాభిమానాన్ని రగిలిస్తూ సాగిన ఈ రచన పాఠకులను ఉర్రూతలూగించింది. ప్రపంచం సంకుచితమైన ఇరుకైన గోడల మధ్య నలిగి పోకూడదని, జ్ఞాన ప్రవాహం ఎడారుల్లో ఇంకి పోకూడదని, అగాధాలను అధిగమించి, నిజం బయటకు రావాలనే తపనకు రవీంద్రుని గీతాంజలి అద్దం పడుతుంది.ఆంగ్ల సాహిత్యంపై అభిలాష పెంచుకుని, సాహితీ ప్రసంగాలను ఆకళింపు చేసుకుని, ఎన్నో మనోరంజకమైన రచనలకు శ్రీకారం చుట్టి జనహృదయాలను రంజింపచేసిన రవీంద్రుడు సృజనాత్మకతకు మరో పేరు.జలియన్ వాలా బాగ్ దమన కాండకు నిరసనగా నైట్ హుడ్ అవార్డును తిరస్కరించి, తనకున్న దేశభక్తిని ప్రదర్శించాడు. మాతృభూమి పట్ల గౌరవం, మాతృభాషపై మమకారం, అపారమైన దేశభక్తి గల రవీంద్రుడు మానవ సంబంధాలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చేవాడు. అప్యాయతలు కనుమరుగై, మానవీయ సంబంధాలు మృగ్యమై,సాటి మనిషిని మనిషిగా చూడలేని మానసిక అంధత్వంలో, మానవత్వానికి ఘోరీ కడుతున్న వర్తమాన సమాజంలో రవీంద్రుని మానవతా విలువలను ఆదర్శంగా తీసుకోవాలి. పత్రికలను చదవడం మానేసి, పుస్తక పఠనం వదిలేసి, సాంఘిక మాధ్యమాలు చిందించే విషాన్ని ఒంటబట్టించుకుని, అసభ్యతను, అశ్లీలతను ఆరాధిస్తూ, అసాంఘిక పోకడలతో మానవ లక్షణాలను కోల్పోతున్న నేటి మనుషుల ప్రపంచం కృత్రిమ సంస్కృతిని అలవరచుకుంటున్నది. సృజనాత్మకతను వదిలేసి, నిజమైన జ్ఞానాన్ని పరిత్యజించి, అజ్ఞానాంధకారంలో జీవిస్తున్న వర్తమాన సమాజంలో నిజమైన విద్యకు శ్రీకారం పలకాలి. అలనాటి రవీంద్రుని శాంతి నికేతన్ తరహాలో జ్ఞానాన్ని అందించే విద్యలను నేర్వాలి. ప్రకృతిని ఆస్వాదిస్తూ, ప్రకృతి ఒడిలో ప్రశాంతమైన వాతావరణంలో పెరుగుతూ, పెద్దలను గౌరవిస్తూ, క్రమశిక్షణతో జ్ఞానాన్ని ప్రసాదించే చదువులను అభ్యసిస్తూ, సృజనాత్మకతను అలవరచుకుని రవీంద్రనాథ్ టాగోర్ బహుముఖ ప్రజ్ఞాపాటవాలను స్ఫూర్తిగా తీసుకుని, ఆయన ఆదర్శాలను దేశభక్తిని, మానవతావాదాన్ని పెంపొందించుకోవాలి. సహజత్వాన్ని అలవరచుకోవాలి. ప్రకృతి మధ్య జీవించడానికి అలవాటు చేసుకోవాలి.

**(మే 7న రవీంద్రనాథ్ టాగోర్ జయంతి)**

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463



# బహుళ సంక్షోభాల యుగంలో ప్రపంచం



ఐక్యరాజ్యసమితి ఆర్థిక సామాజిక వ్యవహారాల విభాగం, ఐక్యరాజ్యసమితి విశ్వ విద్యాలయ ప్రపంచ అభివృద్ధి ఆర్థిక పరిశోధనా సంస్థతో కలిసి 'ప్రపంచ సామాజిక నివేదిక - 2025' ని విడుదలచేసింది. పెరుగుతున్న అసమానత, ఉద్యోగ అభద్రత, సామాజిక అపనమ్మకం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ముందుకు తీసుకెళ్లడానికి సమానత్వం, భద్రత, సంఘీభావంపై దృష్టి సారించిన పునరుద్ధరించిన ప్రపంచ విధాన ఎజెండా నివేదిక ప్రతిపాదించింది. కీలక ప్రపంచ సామాజిక అభివృద్ధి ధోరణులు నివేదిక చూపింది. ఆదాయం, ఉపాధి, సంస్థాగత విశ్వాసంలో పెరుగుతున్న అసమానతలు నివేదిక నొక్కిచెప్పింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల వైపు ప్రపంచ ప్రయత్నాలు తిరిగి సమలేఖనం చేయడానికి వ్యూహాలు ప్రతిపాదించింది. ఈ నివేదిక సమాజాలు బెదిరిస్తున్న ధోరణులు వెల్లడించింది. తక్షణ నిర్ణయాత్మక విధాన చర్యలు తీసుకోవాలని నివేదిక పిలుపునిచ్చింది. సామాజిక ఒప్పందాలు పునర్నిర్మించడానికి, జీవనోపాధి మెరుగుపరచడానికి, ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం సంఘీభావం పునరుద్ధరించడానికి తక్షణ విధాన సంస్కరణలు అవసరమని తెలిపింది.

ప్రపంచం ఇప్పుడు బహుళ సంక్షోభాల యుగంలో ఉంది. అనేక సవాళ్లు ఒకేసారి సంభవిస్తున్నాయి. ఇవి సమాజాలను అస్థిరపరుస్తున్నాయి. ఆర్థిక అభద్రత అధికంగా ఉంది. అసమానతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. సమాజంలో పరస్పర నమ్మకం తగ్గింది. సామాజిక విచ్ఛిన్నం పెరుగుతోంది. ప్రపంచంలో 60% మంది ఆర్థిక అభద్రత ఎదుర్కొంటున్నారు. వారి ఆర్థిక భవిష్యత్తుపై వారికి నమ్మకం లేదు. 69 కోట్లకు పైగా ప్రజలు ఇంకా తీవ్ర పేదరికంలో జీవిస్తున్నారు. వారి రోజువారీ అవసరాలు తీరడం కూడా కష్టంగా ఉంది. అన్ని దేశాలలో మూడింట రెండు వంతులలో ఆదాయ అసమానతలు పెరుగుతున్నాయి. ప్రపంచ జనాభాలో 95% కంటే ధనవంతులైన 1% మంది ఎక్కువ సంపద కలిగి ఉన్నారు. ప్రపంచ జనాభాలో సగానికి పైగా తమ ప్రభుత్వాలపై తక్కువ నమ్మకం కలిగి ఉన్నారు. ఇది పాలన పట్ల అసంతృప్తి సూచిస్తుంది. 2024లో ప్రతి ఐదుగురిలో ఒకరు వాతావరణ వైపరీత్యాలు ఎదుర్కొన్నారు. ఇది పర్యావరణ సంక్షోభ తీవ్రత తెలియజేస్తుంది. ప్రతి ఏడుగురిలో ఒకరు సంఘర్షణ ప్రభావిత ప్రాంతాలలో నివసిస్తున్నారు. ఇది వారి జీవితాలు అభివృద్ధి తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఉపాధి జీవనోపాధి అభద్రత స్థితి గత మూడు దశాబ్దాలలో ప్రపంచం పేదరికం తగ్గించడంలో కొంత పురోగతి సాధించింది. ఇది సమిష్టి ప్రయత్నాలు సానుకూల ఫలితాలు ఇస్తాయని నిరూపించింది. అయితే ఈ పురోగతి అందరికీ సమానంగా అందలేదు. ఆర్థిక అభద్రత విస్తృతంగా వ్యాపించింది. అనేకమందికి స్థిరమైన ఉద్యోగాలు లేవు. తగినంత ఆదాయం సంపాదించడంలో వారు కష్టపడుతున్నారు. లెక్కలేనన్ని కుటుంబాలు ఒక చిన్న ఆపద వస్తే పేదరికంలో కూరుకుపోయే స్థితిలో ఉన్నారు. ఆఫ్రికా, దక్షిణాసియా వంటి ప్రాంతాలలో అనధికారిక అభద్రత ఉద్యోగాలు ఎక్కువగా ఉన్నాయి. ఉద్యోగ అస్థిరత ఆదాయంలో అస్థిరతకు దారితీస్తుంది. ఇది బలహీనమైన సామాజిక రక్షణ కల్పిస్తుంది. సంస్థలపై తగ్గుతున్న నమ్మకం సామాజిక విచ్ఛిన్నం ప్రభుత్వాలు రాజకీయ సంస్థలు ఇతర ప్రజా సంస్థల పట్ల ప్రజలలో నమ్మకం తగ్గింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలకు సుపరిపాలనకు ముప్పు కలిగిస్తుంది. తప్పుడు సమాచారం వదంతులు వేగంగా వ్యాప్తి చెందడం, డిజిటల్ అంతరాలు ఏర్పడటం, పాలనా వైఫల్యాలు ఈ అపనమ్మకాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. నకిలీ వార్తలు, ఆన్‌లైన్ ధ్రువణత, సామాజిక సంధానాన్ని దెబ్బతీస్తున్నాయి. నమ్మక స్థాయిలు వివిధ వర్గాల మధ్య కూడా తగ్గుతున్నాయి. ఇది సమాజంలో సమైక్యత లోపాన్ని సూచిస్తుంది. ప్రస్తుత స్థితి పట్ల నిరాశ అపనమ్మకం పెంచుతోంది. ప్రపంచ సంఘీభావ పునాదులు బలహీనపరుస్తోంది.

ప్రతి ఒక్కరు వారి అవసరాలు బట్టి అవకాశాలు పొందడం నిర్ధారిస్తుంది. సామాజిక



చలనశీలత పెంపొందించడం, విద్య ఆరోగ్యం వంటి ప్రాథమిక సేవల అందుబాటులో ఉన్న అంతరాలు తగ్గించడం సమానత్వం లక్ష్యం. వివక్షకు గురిచేయబడిన వర్గాలు అనగా లింగం జాతి మతం వైకల్యం ఆధారంగా వివక్షత తొలగించి వారిని సమాజంలో సంపూర్ణంగా చేర్చడం దీనిలో అంతర్భాగం. ప్రగతిశీల పన్ను విధానాలు సంపద పంపిణీ మెరుగుపరచడం విద్య ఆరోగ్యం అందరికీ అందుబాటులో ఉంచడం ద్వారా ఇది సాధ్యం అవుతుంది. సామాజిక న్యాయం అందరికీ గౌరవప్రదమైన జీవితం అందించడం దీని అంతిమ లక్ష్యం.

నిరుద్యోగ భృతి, అనారోగ్య సెలవులు, పెన్షన్ పథకాలు ఇతర సామాజిక సహాయ కార్యక్రమాలు దీనిలో భాగంగా ఉంటాయి. శ్రామిక మార్కెట్లలో అనిశ్చితి తగ్గించడానికి కార్మికులకు సరైన వేతనాలు మంచి పని పరిస్థితులు నిర్ధారించడానికి విధానాలు రూపొందించడం ముఖ్యం. సంస్థలపై విశ్వాసం తిరిగి నిర్మించడం దీనికి కీలకం. వివిధ సామాజిక సమూహాలు తరగతుల మధ్య వారధి నిర్మించాలి. ఉమ్మడి లక్ష్యాలు సాధన అందరూ కలిసి పనిచేయాలి. బలహీన వర్గాల వారికి మద్దతు ఇవ్వడం సామాజిక బాధ్యత ప్రోత్సహించడం ముఖ్యమైనవి. నిర్ణయ ప్రక్రియలలో పౌరులు ముఖ్యంగా అట్టడుగు వర్గాల వారు భాగస్వామ్యం పెంచడం వారి గొంతులు వినడం సంఘీభావం బలోపేతం చేస్తుంది.

విద్య ఆరోగ్యం మంచి పనిలో భారీగా పెట్టుబడి పెట్టాలి. ఇది మానవ మూలధనం అభివృద్ధి చేస్తుంది. సమాన అవకాశాలు కల్పిస్తుంది. ప్రగతిశీల పునఃపంపిణీ పన్ను విధానం అమలు చేయాలి. ఆదాయ సంపద అసమానతలు తగ్గించడానికి ధనిక వర్గాలు పెద్ద సంస్థలపై పన్ను రేట్లు పెంచాలి. పన్ను ఎగవేత అరికట్టాలి. పన్ను వ్యవస్థ పారదర్శకంగా సమర్థవంతంగా మార్చాలి. సేకరించిన నిధులు ప్రజా సేవలపై పెట్టుబడులు పెట్టాలి. అందరికీ ఆరోగ్య సంరక్షణ, పెన్షన్లు, నిరుద్యోగ భృతి ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించే సార్వత్రిక సామాజిక రక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి బలోపేతం చేయాలి. ఇది ఆర్థిక అభద్రత తగ్గిస్తుంది. ప్రజలను దారిద్ర్యంలోకి జారిపోకుండా రక్షిస్తుంది. సంక్షోభ సమయాల్లో వీరికి అండగా నిలుస్తుంది. నాణ్యమైన అందుబాటులో ఉండే విద్య ఆరోగ్యం ఇతర ప్రాథమిక సేవలపై ప్రభుత్వ పెట్టుబడులు గణనీయంగా పెంచాలి. ఇది సమాన అవకాశాలు పెంపొందిస్తుంది. మానవ మూలధనం అభివృద్ధి చేస్తుంది. డిజిటల్ మౌలిక సదుపాయాలు డిజిటల్ నైపుణ్యాలపై పెట్టుబడులు పెట్టడం కూడా ముఖ్యం. అందరూ డిజిటల్ ప్రపంచంలో భాగస్వాములు కావడానికి ఇది సహాయపడుతుంది. కనీస వేతనాలు పెంచడం, సురక్షితమైన పని పరిస్థితులు నిర్ధారించడం, కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు గౌరవించడం, ఇతర కార్మికుల హక్కులు రక్షించడం వంటి చర్యలు తీసుకోవాలి. సాంకేతిక మార్పులు శ్రామిక మార్కెట్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో ఉద్యోగాలు కోల్పోతున్న మారవలసిన కార్మికులకు తిరిగి శిక్షణ ఇవ్వడం నైపుణ్యాలు పెంపొందించడం కోసం కార్యక్రమాలు రూపొందించాలి. బలహీనమైన ఉపాధి దుర్బలమైన పని పరిస్థితులు తగ్గించాలి. సంస్థలు సమ్మిళితంగా, పారదర్శకంగా, జవాబుదారీగా మార్చాలి. ప్రభుత్వ కార్యకలాపాలలో పారదర్శకత జవాబుదారీతనం పెంచాలి.

అవినీతి అరికట్టడానికి బలమైన చట్టాలు సంస్థలు ఏర్పాటు చేయాలి. ఇది ప్రజలలో నమ్మకం పెంచుతుంది. విధాన రూపకల్పన అమలులో పౌరులు, పౌర సమాజ సంస్థలు ఇతర వాటాదారులు చేర్చడానికి యంత్రాంగాలు ఏర్పాటు చేయాలి. ప్రజాభిప్రాయం గౌరవించడం విభిన్న గొంతులు వినడం ముఖ్యం. ఇది విధానాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండేలా చేస్తుంది.

మార్కెట్లలో ఏకస్వామ్యాలు నియంత్రించడం, పోటీ ప్రోత్సహించడం, ఆర్థిక అధికారం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా నిరోధించడం కోసం బలమైన నియంత్రణ విధానాలు అమలు చేయాలి. ఐక్య కార్యాచరణ నడిపించడానికి రాబోయే ప్రపంచ సామాజిక అభివృద్ధి శిఖరాగ్ర సమావేశం 2025 వంటి వేదికలు ఉపయోగించాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక సహాయం, రుణ ఉపశమనం, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ చేయడం ద్వారా మద్దతు ఇవ్వాలి. ఇది ప్రపంచవ్యాప్త సంఘీభావాన్ని పెంపొందిస్తుంది. పర్యావరణపరంగా స్థిరమైన అభివృద్ధి నమూనాలు ప్రోత్సహించాలి. వాతావరణ మార్పులు పర్యావరణ క్షీణత ప్రతికూల ప్రభావాల నుండి బలహీన వర్గాల వారిని రక్షించాలి. పర్యావరణ న్యాయం ప్రోత్సహించడం సహజ వనరులు పరిరక్షణ దీనిలో భాగంగా ఉంటుంది. పర్యావరణ సవాళ్లు పేదరికం అసమానతలు ఎలా పెంచుతాయో గుర్తించి వాటిని పరిష్కరించాలి.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

## సొంతగూట్లో నిబ్బరంగా

తలదాచుకుంటానా..
సరిహద్దు గీతలవద్ద దాగుడుమూతలు
యుద్ధవాతావరణమంతా
నాలోనే..లోలోనే భీకరంగా

సైనికున్ని కాను కనీసం సహాయకున్నీ కానూ
ఏమిటో నిత్యం లోపల ఎడతెగని యుద్ధం
చేతిలో తుపాకి లేదుకానీ
మాటల తూటాలు దూసుకుపోతూనే వున్నాయి
ఎవడో ఒకడు..ఎక్కడో అక్కడ
మానసికంగా బలైపోతూనేవున్నాడు

ఈడొల్ల దేహాలతో
చాలామందే బ్రతుకీడుస్తున్నారు

రెండు సందిగ్ధాల మధ్య మరణ ఘోష
అనుబంధాలన్నీ సంకెళ్లే ..తూచ్

తెంచుకోవాలిపుడు..తెగనరుక్కోవాలిపుడు
నాదనుకునేచోట
రెండు మొక్కల్ని నాటుకోవాలి
పూలు కాయల్నీ ఇవ్వకపోవూ
రెండు సందిగ్ధాల మధ్య

నాదనుకునేచోట
రెండు ఇటుకల్ని పేర్చుకోవాలి
కాసింత నీడనూ ఇవ్వకపోవూ
అప్పటి వరకూ ఆశగా జీవించాలంతే..

మనసునూ దేహాన్నీ చీల్చుతున్న
ఒకానొక అపసవ్యస్థితి

ఆ మూలన ఓ జీవి ప్రశాంతంగానేవుంది
చీపురు విసురుకు చెదిరిపోయిన గూడును
ఎంత ఓపిగ్గా మళ్లీ అల్లుకుంటుందో
ఆ సాలీడు నాలో ఉదయించిన సూరీడు
అదే నాకు ఇప్పుడు ఆదర్శం..!

**- డా. కటుకోఝ్వల రమేష్**
9949083327

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# క్రీడలతో శారీరక.. మానసిక ఆరోగ్యం



మెదడు చురుకుగా పని చేయడానికి శారీరక ఆరోగ్యమే పునాది. శారీరక ఆరోగ్య సిద్ధికి ఏకైక మార్గం మైదాన క్రీడలు లేదా అథ్లెటిక్స్ క్రీడలు మాత్రమే అని తెలుసుకోవాలి. అందువల్లనే సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ అనే నినాదం వింటున్నాం. పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యార్థినీవిద్యార్థులు, యువత దృష్టిని క్రీడల వైపు ఆకర్షించడంతో పాటు అత్యున్నత ప్రతిభ కనబర్చిన అథ్లెట్లను సన్మానించడం, అథ్లెటిక్ పోటీలు నిర్వహించడం లాంటి కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఏటా మే 7న ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం నిర్వహిస్తారు. 1996లో ఇంటర్నేషనల్ అమాచూర్ అథ్లెటిక్ ఫెడరేషన్ ప్రారంభించిన ప్రపంచ అథ్లెటిక్స్ దినం వేదికగా పిల్లలు, యువతను క్రీడామైదానాల వైపు ఆకర్షించడమే ప్రధాన ధ్యేయం.

**అథ్లెటిక్స్ అందించే ప్రయోజనాలు:**

చురుకైన మెదడుతో విద్యలో ఉన్నతి, మైదాన క్రీడలతో శారీరక ఆరోగ్యం కలుగుతుందని తెలుసుకొని నేటి పిల్లలు, యువత విద్య-అథ్లెటిక్స్ను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే పరిపూర్ణ వ్యక్తిత్వం కలిగిన రేపటి పౌరులుగా నిలబడతారు. అథ్లటిక్స్ క్రీడల్లో పరుగు, నడక, ఎగరడం, దునకడం, విసరడం, ఈదడం ఆధారిత పలు క్రీడలు వస్తాయి. అథ్లెటిక్స్లో పాల్గొనే పిల్లలు, యువ క్రీడాకారులకు దేహదారుఢ్యం, శారీరక చురుకుదనం, శరీర అవయవాల సమన్వయం, జట్టు స్ఫూర్తి, టీమ్ స్పిరిట్, గెలుపోటములను సమానంగా తీసుకునే తత్వం, సోదరభావం, వ్యక్తిత్వ వికాసం, సామాజిక గుర్తింపు, సోషల్ స్కిల్స్, ఉద్యోగ ఉపాధుల కల్పన, ఆత్మవిశ్వాసం పెరగడం, ధైర్యంగా జీవితాన్ని విజయం వైపు నడవడం లాంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయి. క్రీడలకు దేశ సరిహద్దులు, భాషాబేధాలు, జాతి మత లింగ వివక్షలు లాంటివి ఉండవు. అథ్లెటిక్స్ ఓ విశ్వ భాష. ఇవి సరిహద్దులను చెరిపేస్తాయి. అందరికీ ఏకం చేస్తాయి. ప్రపంచ శాంతికి ఊతం ఇస్తాయి. పోటీతత్వాన్ని పెంచుతాయి. నిజాయితీగా ప్రవర్తించడం, ఓటమిని నవ్వుతూ ఒప్పుకోవడం, రేపటి గెలుపుకు పట్టుదల



పెంచుకోవడం క్రీడాకారులకే స్వంతం. క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, విపరీత పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం లాంటి అతి ముఖ్యమైన వ్యక్తిగత ఎదుగుదలకు సంబంధించిన ప్రయోజనాలు కలుగుతాయని తల్లితండ్రులు గమనించాలి.

**తల్లితండ్రులు, విద్యాలయ యాజమాన్యాలకు వినతులు:**

2025 ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవ శుభవేళ తల్లితండ్రులు, విద్యాలయ యాజమాన్యాలు కొన్ని కఠిన నిర్ణయాలను తీసుకొని అమలుకు నడుం బిగిద్దాం. నేటి అత్యాధునిక డిజిటల్ ఏఐ యుగపు పిల్లలు, యువత అంతా కలిసి ఐక్యతతో మార్కులు, ర్యాంకులు, వీడియో గేమ్స్, స్మార్ట్‌ఫోన్ మాధ్యమాల వెంట పరుగెత్తుతూనే ఉన్నారు. అమ్మనాన్నలతోనే మాట్లాడే కాసింత సమయం దొరకనంత బిజీగా ఉన్న పిల్లలకు మైదాన క్రీడల గూర్చి ఆలోచించే క్షణం తీరిక దొరకడం లేదు. ప్రేమగా అయ్యవ్వ వడ్డించిన భోజనాన్ని కడుపు నిండా తినడం, ఫ్యాన్ల కింద కాలం గడపడం, శారీరక కదలికలకు ఆస్కారం ఇవ్వకపోవడం, స్థూలకాయులుగా కుటుంబాలకు, దేశానికి భారం కావడం జరుగుతోంది. మన పిల్లలు మైదాన క్రీడల్లో పాల్గొనే విధంగా వారిని ప్రోత్సహిద్దాం. విద్యాలయాల్లో క్రీడా మైదానాలు పిల్లలతో కలకలలాడాలి. సరైన మైదానాలు లేని పాఠశాలలకు అనుమతులు ఇవ్వకూడదు. పాఠ్య ప్రణాళికలో క్రీడలకు ప్రాధాన్యం పెంచాలి. తూతూ మంత్రంగా కొన్ని యాజమాన్యాలు పిఈటిలను నియమించి చేతులు దులుపుకుంటూ, వారిని ఇతర విధులకు వాడుకోవడం ఆక్షేపణీయం. ప్రపంచ అథ్లెటిక్స్ దినం వేదికగా క్రీడా పోటీలు, అథ్లెట్లను సన్మానించడం, మాలథాన్స్, ర్యాలీలు, ట్రాక్ అండ్ ఫీల్ పోటీలు, అవగాహన కార్యక్రమాలు, సామాజిక మాధ్యమ ప్రచారాలు లాంటి పలు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోంది. శరీర కదలికలే రేపటి ఆరోగ్య గుళికలు. క్రీడలకు దూరమైంతే బరువెక్కి దేశానికే భారం అవుతాం. కాలంతో పాటు వేగంగా కదులుదాం, అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా ఛేదిద్దాం.

**(07 మే ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## మల్టీ స్పెషాలిటీ హెల్త్ డయాగ్నిక్ సెంటర్‌ను ప్రారంభించిన ఎంపీ



గండిపేట, మే 6(మనంన్యూస్)ః మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అల్కాపూర్ టౌన్షిప్ రోడ్ నెంబర్ 25 లో ధాన్వి మల్టీ స్పెషాలిటీ హెల్త్ డయాగ్నిక్ సెంటర్ ని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ భారతీయ జనతా పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడి, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కొండ కళ్ళ నరేందర్ రెడి, కొండకల రామకృష్ణారెడ్డి యాంకర్ శివారెడ్డి, దాన్వి హెల్త్ సెంటర్ సీఈఓ శ్రీనివాసరెడ్డి , మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాల్‌రెడ్డి, భారతీయ జనతా పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షులు బి రవి కాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ చిలుకూరు బీరప్ప, డి రాజేష్, పాకనాటి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ వందన నాగేష్, మాజీ మున్సిపాలిటీ కోఆప్షన్ మెంబర్ లక్ష్మి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఇందిరా, నీలెస్ దొబ్బె, అల్కాపూర్ కాలనీవాసులు తదిత రులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తా

- రాష్ట్ర మంత్రి టి.జి భరత్




ఎమ్మిగనూరు, మే 6 (మనం న్యూస్)ః ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు గుర్తింపు తెచ్చేందుకు తాను కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని బనవాసిలో ఎంఎస్ఎంఈ మెగా టెక్స్ టైల్స్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు ఎన్.ఎం.డి ఫరూక్, సవితమ్మలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో టెక్స్ టైల్స్ పార్క్ తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే బి.వి జయనాగేశ్వర్ రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుచేసే దిశలో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఎమ్మిగనూరు ఎంఎస్ఎంఈ పార్కులో పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తాను పూర్తిగా సహకరిస్తానన్నారు. ముందుగా ఎకో సిస్టం తయారుచేస్తే తర్వాత పరిశ్రమలు తరలివస్తాయన్నారు. ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలతో తయారుచేసే శాలువాలను టిటిడిలో ఉపయోగించుకునేలా మాట్లాడతానని చెప్పారు. తన శాఖలో సైతం వీటిని ఉపయోగిస్తానని చెప్పారు. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. మరో రెండు దశాబ్దాల పాటు మా ప్రభుత్వం కొనసాగితే రాష్ట్రం దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో ముందు వరుసలో ఉంటుందని మంత్రి టి.జి భరత్ చెప్పారు.



## శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

గడివేముల, మే 6(మనంన్యూస్)ః మండలంలోని బూజునూరు గ్రామంలో మంగళవారం నాడు శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారి ఊరుదేవర తిరునల్ మహోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు టిడిపి ఇన్చార్జి గౌరు వెంకట్ రెడ్డి శ్రీ సుంకుల పరమేశ్వరి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని సరైన సమయానికి వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామాల అభివృద్ధి కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు పూలమాలతో శాలబాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పంట రామచంద్రారెడ్డి, దిలీప్ కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, దేశం నారాయణరెడ్డి, కేబి మల్లి టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో అన్నదాత ఆగమాగం

- మాజీ ఎమ్మెల్యే సుంకర రవిశంకర్
- కాంటాల కోసం రైతుల పడిగాపులు



గంగాధర, మే 06, (మనం న్యూస్)ః ఆరుగాలం కష్టపడి పంటసాగు చేసిన రైతులకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయని, పంటసాగు ప్రారంభం నాటి నుంచి పంటను విక్రయించే వరకూ అన్నదాత పడరాని పాట్లు పడుతున్నడని చొప్పదండి మాజీ శాసన సభ్యులు సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. గంగాధర మండలంలోని మార్కెట్ యార్డ్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లాలల్లో నిల్వ ఉన్న వడ్లను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలకు పంటలు నానే పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. దీనివల్ల రైతులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పంటల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ప్రతి రైతుకూ మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టారని, పంట కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ అధ్వానంగా మారిందని అన్నారు. ధాన్యం అమ్మిన డబ్బులు 10 రోజులు దాటుతున్నా రైతులకు చెల్లించడం లేదని తెలిపారు. ధాన్యం డబ్బులు 48 గంటల్లోనే చెల్లించాలని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన మాటలు ఉత్త మాటలే అయ్యాయని అన్నారు. 70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటి వరకు 24.43 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని, దీని విలువ రూ. 5664 కోట్లు అని, చెల్లించింది మాత్రం రూ. 3163 కోట్లు అని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వాహకుల అలసత్వం, ఫలితంగా అన్నదాతలు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి వారాల కొద్దీ వేచి చూసినా కాంటాలు కావడం లేదని సుంకె తెలిపారు. టార్పాలిన్ కవర్లు ఇవ్వకపోవడంతో, అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నాయని, వివిధ కారణాలు చెప్పి 5 కిలోల దాకా తరుగు తీస్తుండటం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నదని, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రైతుల నష్టాలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రవి శంకర్ వెంట తాజా మాజీ సర్పంచు మడ్లపెల్లి గంగాధర్, ముక్కెర మల్లేశం, కంకణాల విజయేందర్ రెడ్డి, నాయకులు రామిడి సురేందర్, వడ్లూరి ఆదిమల్లు ఉన్నారు.

## ఆశ వర్కర్లు సమ్మెకు సిద్ధం




వాజేడు, మే 6, (మనం న్యూస్): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని అనేకమార్లు అధికారులకు విన్నవించిన ఫలితం లేకపోవడంతో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సమ్మెకు సిద్ధమైంది. ఈ మేరకు మంగళవారం స్థానిక వైద్యాధికారికి సమ్మె నోటీసు అందించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల రఘుపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందన్నారు. ఆశా వర్కర్ల తో 12 గంటల పాటు పనిచేయించుకోవడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక రంగంతోపాటు వ్యవసాయ రంగాన్ని కూడా ఈ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు సైతం రోడ్డున పడ్డారని తెలిపారు. అసంఘటిత కార్మికులు, స్కీమ్ వర్కర్లు, వ్యవసాయ కార్మికులు, రైతులతో మే 20 తారీఖున సమ్మె చేస్తున్నారని ఈ సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాలం శాంతకుమారి, సరిత, జ్యోతి పాల్గొన్నారు.

## వడ్లు వర్షార్పణం

- బస్టాండ్‌లోకి వర్షపు నీరు
- ఇబ్బందులు పడిన ప్రయాణీకులు



హుస్నాబాద్,మే 6,(మనం న్యూస్)ః వరి రైతుకు కన్నీరే మిగిలింది. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటను ఆకాల వర్షాలతో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యింది. సోమవారం రాత్రి భారీ ఈదురుగాలులతో హుస్నాబాద్ నియోజకవర్గంలో భారీ వర్షం కురిసింది. హుస్నాబాద్, కోహెడ, సహా చాలా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లోకి వరద నీరు చేరింది. దీంతో నీటిని ఎత్తిపోసి , తడిసిన వడ్లను ఆరబోసుకుంటూ పంటను కాపాడుకునేందుకు నానా పాట్లు పడాల్సి వచ్చింది. అలాగే వర్షంతో పలు ప్రాంతాల్లో మామిడికాయలు నేల రాలాయి. అంతే కాకండా మామిడికి తెగుళ్ల వచ్చే అవకాశం ఉంది. పంట చేతికి వచ్చి అమ్ముకునే సమయంలో ఆకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేసారు.

### బస్టాండ్‌లోకి వర్షపు నీరు...

సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నూతనంగా రూ.2 కోట్లతో నిర్మించిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలోకి వర్షపు నీరు చేరింది. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీటిలోనూ నడుచుకుంటూ ప్రయాణ ప్రాంగణానికి చేరుకున్నారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయాణ ప్రాంగణాన్ని సందర్శించి వర్షపు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన విషయం విధితమే. రానున్నది వర్షాకాలం అవ్వడంతో మరోసారి వర్షపు నీరు బస్టాండ్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు. రూ.2 కోట్లతో నిర్మించిన బస్టాండ్‌లో వర్షపు నీరు పోవడానికి డ్రైనేజీ నిర్మించకపోవడం, పైపు లైన్ ఏర్పాటు చేయకపోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు.

## బ్లాక్ కరెన్సీ ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు

- డబ్బు ఆశ చూపే కేటు గాళ్లను ప్రజలు నమ్మద్దు
- డీఎస్పీ రఘు చందర్




వెల్గటూర్, మే 6 (మనం న్యూస్): తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని మోసం చేసే బ్లాక్ కరెన్సీ కేటుగాళ్ల ఆగడాలను వెల్గటూర్ పోలీసులు గుట్టు రట్టు చేశారు. మంగళవారం వెల్గటూర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో డీఎస్పీ రఘు చందర్, సిఐ రాం నర్సింహా రెడ్డి లతో కలసి బ్లాక్ కరెన్సీ మోసాల తీరు ను పాత్రికేయుల సమావేశంతో వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని చేగ్యాం గ్రామానికి చెందిన రామిల్ల విజయసాగర్ అనే వ్యక్తి నీ బీరుపూర్ మండలం తుంగూరు గ్రామానికి చెందిన పలాజీ శ్రీనివాస్ అనే వ్యక్తి తన వద్ద బ్లాక్ కరెన్సీని అసలైన నోట్లుగా మార్చే రసాయనం ఉందని నమ్మించారు. 7 లక్షల అసలైన కరెన్సీ కి 35 లక్షల బ్లాక్ కరెన్సీ ఇస్తామని నమ్మబలికి దుస్తూరాబాద్ మండలం చెన్నూరు గ్రామానికి చెందిన ఎంబడి మల్లేష్, కడెం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన అల్తాపు రాజు, దుస్తురాబాద్ మండలం బుట్టాపూర్ గ్రామానికి చెందిన మగ్గిడి కిషన్ లు ఈ ముఠాలో సభ్యులు కాగా వీరు పథకం ప్రకారం ఈనెల 4న మండలంలోని కోటిలింగాల వద్ద నోట్లు మార్చుకుందామని నమ్మించి 7లక్షలు తీసుకొని ముందుగానే ప్యాక్ చేసి తీసుకువచ్చిన బొమ్మ నోట్లను చూపించారు. ముందుగానే చేసుకున్న పథకం ప్రకారం ఆ ముఠా లోని సభ్యులే పోలీసులమని చెప్పి ఇద్దరు వ్యక్తులు రాగా ముఠా సభ్యులందరూ కలిసి 7 లక్షలతో ఉడాయించారు. మోసపోయినట్లు గ్రహించిన విజయసాగర్ వెల్గటూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.ఈనెల 6 న స్తంభంపల్లి గ్రామ శివారులో హరిత హోటల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న పలాజీ శ్రీనివాస్, అల్తాపు రాజు వెంబడి మల్లేష్ ఎంబడి రాజశేఖర్, కంది నరేష్ లను అదుపులోకి తీసుకొని వీరు నుండి ఒక కారు బైక్ 5 సెల్ ఫోన్లు రెండు లక్షల నాలుగు వేల నగదు, మోసం చేసేందుకు ఉపయోగించే నల్ల రంగు నమూనా నోట్లు, బొమ్మ నోట్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మిగతా నిందితులు పరారీలో ఉన్నారని,నిందితులను చాకచక్యంగా పట్టుకొని కేసును చేదించిన వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్,పోలీస్ సిబ్బందిని డిఎస్పి రఘు చందర్, సీఐ రాం నర్సింహా రెడ్డి లు అభినందించారు.ఈ కార్యక్రమంలో ధర్మపురి ఎస్సై ఉదయ్ కుమార్,బుగ్గారం ఎస్సై శ్రీధర్ రెడ్డి, కానిస్టేబుల్ కిరణ్,ఆదిల్,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో యువకుడు మృతి




హుస్నాబాద్, మే 06, మనం న్యూస్: విద్యుత్ షాక్ తో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని హనుమాన్ నగర్ లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హనుమాన్ నగర్ కు చెందిన శివాజీ (18) రాత్రి బాత్ రూమ్ కోసమని లేచాడు. రాత్రి కురిసిన ఈదురు గాలుల వర్షానికి ఓ ఇంటి బాత్ రూమ్ పై విద్యుత్ తీగ తెగిపడింది. బాత్రూం కు వెళుతూ డోర్ ముట్టుకోవడంతో అతడికి విద్యుత్ షాక్ వచ్చి యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయండి

- గతంలో సమ్మక్క - సారక్క ఇతర దైవ కార్యాల అనుభవాలతో ఏర్పాట్లు చేయాలి
- అధికార యంత్రాంగానికి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు ఆదేశం
- సీఎస్, డీజీపీ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే



భూపాలపల్లి, మే 6 (మనం ప్రతినిధి)ః భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రవహించే 'అంతర్వాహిని' సరస్వతీ నదీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమలు, చేనేత శాఖ శాఖల మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. మంగళవారం మంత్రి సురేఖ ఆధ్వర్యంలో కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలపై డా బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో దేవాదాయశాఖ మంత్రి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యంత పవిత్రమైన ఈ త్రివేణి సంగమ పుష్కరాల కు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు వస్తారని తెలిపారు. సరస్వతీ నది పుష్కరాలు బృహస్పతి మిథున రాశి ( మిథునరాశి )లోకి ప్రవేశించినప్పటి నుండి 12 రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిన పుష్కరాలు తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడిన తరువాత వచ్చాయని అన్నారు. 2025 మే 14న రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కరకాలం ప్రారంభమవుతాయని, అప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని స్పష్టం చేశారు. మరుసటి రోజు సూర్యోదయం నుంచి భక్తులు పుష్కర పుణ్యస్నానాలు ఆచరిస్తారని తెలిపారు. ఈ పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్ల వివరాలు భక్తులకు సమగ్రంగా తెలిపేందుకు కాళేశ్వరం సరస్వతి పుష్కరాల వెబ్ పోర్టల్, మొబైల్ యాప్పు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల ప్రారంభించారు. సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులు, యాత్రికులకు సంబంధించిన వివరాలు తెలిపేందుకు వాటిని ప్రారంభించినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. 'సరస్వతీ పుష్కరాలు' పండుగకు స్నాన ఘాట్ల విస్తరణతో సహా వివిధ అభివృద్ధి పనులను విస్తృతం గా చేపట్టినట్లు మంత్రులు తెలిపారు. చిన్న చిన్న పనులు పెండింగ్ లో ఉన్నాయని... అవి కూడా పుష్కరాలు ప్రారంభం అయ్యేలోగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు.ఈ పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చాలా క్రీయాశీలకంగా పని చేస్తుందన్నారు. సమ్మక్క సారక్క జాతర, కొమురవెల్లి కల్యాణం, భద్రాచలం కల్యాణం మాదిరి ఈ పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించుటకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. చలువ పందిళ్లు, టెంట్లు, శాశ్వత మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు వివరించారు. కాళేశ్వరంకు సంబంధించిన వివరాలన్నీ వెబ్ సైట్, యాప్ ద్వారా తెలియ జేయాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మంత్రి సురేఖ సూచించారు. 'ఉత్తరాన ప్రయాగ వద్ద, దక్షిణ భారతంలో కేవలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో మాత్రమే సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తుందని మంత్రి కొండా తెలిపారు. పవిత్ర సరస్వతీ పుష్కర స్నానం చేసిన వారికి సమస్త పాపములు తొలగిపోతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వాసిస్తారని ఆమె తెలిపారు.

### పీఠాధిపతులో పవిత్ర పుష్కర స్నానం

సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు ఒక పీఠాధిపతి ఈ పుష్కర స్నానం చేయనున్నట్టు మంత్రి కొండా తెలిపారు. పుష్కర ప్రారంభం మే 15, 16వ తేదీన శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్ నుంచి శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామిలు పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభిస్తారన్నారు. ఈ సమీక్షా సమావేశంలో భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఆర్ అండ్ బీ ప్రిన్స్ పల్ సెక్రటరీ వికాస్ రాజ్, పంచాయతి రాజ్ గ్రామీణాభివృద్ధి సెక్రటరీ లోకేష్. కుమార్, సెర్ఫ్ సీఈఓ దివ్యా దేవరాజన్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే ఇతర శాఖల ఉన్నతాధికారులు, ఆలయ ఈఓ మహేశ్, ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

# అక్టోబర్ లో తెలంగాణ రచయితల వేదిక రజతోత్సవాలు

**కామారెడ్డి టౌన్, మే 6 (మనం న్యూస్):** తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర 3వ కార్యవర్గ సమావేశం కామారెడ్డిలోని కర్షక్ బీఈడీ కళాశాలలో రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అధ్యక్షతన, తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు సమన్వయంలో మంగళవారం జరిగింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెరవే కృషిని ప్రశంసిస్తూనే, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ పునర్నిర్మాణం కోసం తెరవే చేస్తున్న సేవను అవలోకనం చేసుకోవడం జరిగింది. తెలంగాణ భాష, సాహిత్యం, సాంస్కృతి, చరిత్రల పునర్నిర్మాణం కోసం తెరవే నిరంతరం పాటుపడుతూనే ఉన్నదని వక్తలు ఉన్నారు. సమకాలీనమైన సమస్యల సాధన కోసం తెలంగాణ రచయితలు సంఘటితంగా కలం కదుపుతూ, భావసారుప్యం కలిగిన సంస్థలతో కలిసి నడుస్తున్నదని తెలిపారు.

తెలంగాణ రచయితల వేదిక 2001లో ఆవిర్భవించి నేటికీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్టోబర్ మాసంలో రజతోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా 25 ఏళ్ల తెలంగాణ రచయితల వేదిక చరిత్రను అచ్చురూపంలోకి తీసుకురావాలని, ప్రత్యేక కవితా సంకలనాన్ని




వెలువరించుకోవాలని తీర్మానం చేశారు.

తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యవర్గం చేసిన తీర్మాణాలు.

1.డిగ్రీ స్థాయి వరకు తెలుగును ప్రథము భాషగా అమలు చేయాలి.

2.ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి ఆదివాసీల హక్కులు రక్షించాలి.

3.వడగండ్లవానతో కడగండ్ల పాలైన రైతులకు నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలి.

4.అక్టోబర్ 2025 నెలలో తె.ర.వే. రజతోత్సవం నిర్వహించాలి.

5.తె.ర.వే. కవిత్వ సంచిక కోసం ఉదారి నారాయణ సంపాదకులుగా కూకట్ల తిరుపతి, గఫూర్ శిక్షాక్ సభ్యులుగా కమిటీ ఏర్పాటు.

6. 25 యేండ్ల తె.ర.వే. చరిత్ర సంచిక కోసం గాజోజు నాగభూషణం సంపాదకులుగా పర్కపెల్లి యాదగిరి, ఆడెపు లక్ష్మణ్ కమిటీ

7.వనరుల విధ్వంసాన్ని అరికట్టాలని తీర్మానం చేశారు. ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పెరవే రాష్ట్ర మాజీ అధ్యక్షులు గాజోజు నాగభూషణం, తెరవే రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఉదారి నారాయణ, నగునూరి శేఖర్, సూరారం శంకర్, కూకట్ల తిరుపతి, ఆడెపు లక్ష్మణ్, రాష్ట్ర కోశాధికారి పెంచాల రంగన్న, రాష్ట్ర కార్యదర్శులు గఫూర్ శిక్షక్, తప్పెట ఓదయ్య, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, నిర్మల్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ వెంగలి నాగరాజు, చౌడబోయిన తిరుపతి, నారాయణ గౌడ్, వెంకట్, మహమ్మద్ పాష, దర్పల్లి సాయికుమార్, విజయశ్రీ తదితర జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టం ప్రకారం భూ సర్వే చేసి పూర్తి వివరాలను సేకరించాలి

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, మే 6 (మనంప్రతినిధి):** భూ భారతి చట్టం ప్రకారం భూ సర్వే చేసి పూర్తి వివరాలను సేకరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం లింగంపేట్ మండలం నల్లమడుగు, ముంబాజీపేట గ్రామంలో భూ భారతి సర్వే టీమ్ లు క్షేత్ర పర్యటన చేసి సర్వే భూ వివరాలు, పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్న వాటి వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం ప్రకారం సాగు చేస్తున్న భూముల వివరాలు, ఎన్ని సంవత్సరాల నుండి సాగు చేస్తున్నారు, సర్వే నెంబర్, భూ విస్తీర్ణం, సాగు చేస్తున్న రైతుల సంఖ్య, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతమా లేక పట్టా భూమా అనే వివరాలు అటవీ శాఖ అధికారులు, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేయాలని సూచించారు. ఏళ్ల తరబడి సాగుచేస్తున్న భూ వివరాలను సంబంధిత రైతులను అడిగి తెలుసుకున్నారు. చట్టం ప్రకారం భూముల వివరాలు సేకరించి ఎలాంటి సమస్యలకు తావులేనట్లయితే పట్టా లకు సిఫారసు చేయాలని సూచించారు. అనంతరం లింగంపేట్ మండలం భవానీపేట్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను కలెక్టర్ సందర్శించి, కొనుగోళ్ల వివరాలు, రైతుల వివరాలు, కేంద్రాల్లో వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, భూ భారతి ప్రత్యేక అధికారి రాజేందర్, రెవిన్యూ, పౌరసరఫరాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా విద్యుత్ భద్రతా వారోత్సవాలు

**ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి టౌన్, మే 6(మనం న్యూస్):** టీజీఎన్పీడీసీయల్ ఆధ్వర్యంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు-2025 ను 01 మే నుండి 07 మే వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాభారతి ఆడిటోరియంలో కామారెడ్డి డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరై విద్యుత్ ఉద్యోగులు భద్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరాన్ని పురస్కరించుకుని ప్రసంగించారు. విధి నిర్వహణలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, 24 గంటల విద్యుత్ సేవలను నిస్వార్థంగా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.,




విద్యుత్ ఉద్యోగులందరూ భద్రతా నిబంధనలు తగిన విధంగా పాటించడమే కాకుండా, విధుల్లో నిష్టతో కూడిన ప్రవర్తన కలిగి ఉండాలి. ప్రతి ఉద్యోగి భద్రత పట్ల అప్రమత్తంగా ఉండి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలి. విద్యుత్ విభాగం ప్రజలతో నేరుగా సంబంధం కలిగి ఉండే విభాగం కనుక, వారి భద్రతే వా మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని స్పష్టం చేశారు.

అనంతరం, డాక్టర్ రమేష్ బాబు (అనస్తీసియా స్పెషలిస్ట్) మాట్లాడుతూ., విద్యుత్ ప్రమాదాల సందర్భంలో తీసుకోవాల్సిన ప్రాథమిక చికిత్సలు, సిపిఆర్ చేయువలసిన విధానాన్ని కార్యాచరణాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది కళాబృందం నిర్వహించిన నాటకం ద్వారా వ్యవసాయదారులకు విద్యుత్ సంబంధిత ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్ భద్రత అధికారి) ఎం. ప్రభాకర్, డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్) కళ్యాణ చక్రవర్తి, డివిజనల్ ఇంజనీర్ (ఎంఆర్టీ) నాగరాజు పాల్గొని, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ లు, సబ్ ఇంజనీర్స్, ఓఎం సిబ్బంది, సబ్ స్టేషన్ ఆపరేటర్స్ తో పాటు ప్రజలు, భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**జాతీయం- అంతర్జాతీయం**

# 100 డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్.. మాస్కోలో విమానాశ్రయాల మూసివేత!



- ఉక్రెయిన్ మాస్కోపై దాదాపు 100 డ్రోన్లతో విరుచుకుపడింది

**కీవ్, మే 7:** యుద్ధం ముగించేందుకు ఓవైపు అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ రష్యా- ఉక్రెయిన్ పరస్పర దాడులు కొనసాగిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా భారీస్థాయిలో విరుచుకుపడడంతో..కీవ్ పెద్ద ఎత్తున ప్రతీకార దాడులు చేస్తోంది. తాజాగా ఉక్రెయిన్ 100కు పైగా డ్రోన్లతో మాస్కోలోని డజనుకు పైగా ప్రాంతాలపై విరుచుకుపడింది. అయితే పలు డ్రోన్లను తాము సమర్థవంతంగా కూల్చేసినట్లు రష్యా పేర్కొంది. డ్రోన్ దాడుల కారణంగా మాస్కోకు సమీపంలోని 4 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మాస్కోలోని ప్రధాన ప్రాంతాల్లో ఉక్రెయిన్ దాడుల వల్ల మరో తొమ్మిది ప్రాంతీయ విమానాశ్రయాలు కూడా స్వల్పంగా ధ్వంసమయ్యాయని..దీంతో వాటిని మూసేయాల్సి వచ్చిందని రష్యా పౌర విమానయాన సంస్థ రోసావియాట్సియా వెల్లడించింది. మరోవైపు రష్యా సరిహద్దు వద్ద ఉన్న ఉక్రెయిన్‌లోని ఖార్కివ్ నగరంపై రష్యా దళాలు 20కి పైగా డ్రోన్లను ప్రయోగించాయి. ఈ దాడిలో నలుగురు గాయపడగా.. దాదాపు 100 మార్కెట్ స్టాళ్లు ధ్వంసమయ్యాయి. మరో ప్రాంతంలో మాస్కో బాంబులు ప్రయోగించిన ఘటనలో ఏడుగురు పౌరులు గాయపడినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు.

## ఐరాస కీలక భేటీలో పాక్ వక్రబుది

- పహల్గాం దాడిపై దృష్టి మళ్లించేందుకే కశ్మీర్ వాదం

**న్యూయార్క్, మే 7:** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను యావత్ ప్రపంచం నిశితంగా గమనిస్తోంది. ఈ పరిణామాల వేళ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో కీలక సమావేశం జరిగింది. ఇందులో పాక్ మరోసారి వక్రబుద్ధి ప్రదర్శించింది. పహల్గాం ఉగ్రదాడిపై దృష్టి మరల్చేందుకు కశ్మీర్ అంశాన్ని లేవనెత్తింది.



పాకిస్థాన్ అభ్యర్థన మేరకు ఐరాస భద్రతా మండలిలో అంతర్గత సమావేశం నిర్వహించారు. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ చర్చలు ఓ కొలిక్కి రాలేదు. ఇందులో ఎలాంటి తీర్మానం చేయలేదు. దీనిపై ఐరాస కూడా ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అయితే, పాక్ మాత్రం మరోసారి అంతర్జాతీయ వేదికను దుర్వినియోగం చేసే ప్రయత్నం చేసింది.

ఐరాసకు పాక్ శాశ్వత ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తిఖర్ ఈ భేటీలో మాట్లాడుతూ.. భారత్‌పై మరోసారి అసత్యాలు వల్లె వేశారు. అంతర్జాతీయ వేదికపై న్యూఢిల్లీని దోషిగా నిలబెట్టేందుకు యత్నించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై ప్రపంచం దృష్టిని మళ్లించేందుకు సమావేశంలో కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దాయాది ఆరోపణలకు భారత్ గట్టిగా బదులిచ్చినట్లు తెలుస్తోంది.

సమావేశం అనంతరం ఐరాస ప్రతినిధి మహమ్మది ఖిలారీ మీడియాతో మాట్లాడారు. ''ఇరుదేశాల మధ్య పరిస్థితి అస్థిరంగా ఉంది. ఈ ఘర్షణాత్మక సమస్యకు చర్చల ద్వారా శాంతియుత పరిష్కారం తీసుకురావాలని భద్రతా మండలి సభ్య దేశాలు పిలుపునిచ్చాయి'' అని తెలిపారు. ఈ చర్చలు ఫలప్రదమయ్యాయని భద్రతా మండలి అధ్యక్షుడు ఎవాన్‌గెలోస్ సెక్రీస్ వెల్లడించారు. ఈ సమావేశానికి కొన్ని గంటల ముందే ఐరాస సెక్రటరీ జనరల్ గుటెరస్ కీలక ప్రకటన చేశారు. ఉగ్రదాడి తర్వాత ప్రజల్లో భావోద్వేగాలను తాను అర్థం చేసుకోగలనన్న ఆయన.. ఇందుకు సైనిక చర్య మాత్రం పరిష్కారం కాదని వ్యాఖ్యానించారు. పొరపాట్లు చేయొద్దని, సంయమనం పాటించాలని ఇరుదేశాలకు విజ్ఞప్తి చేశారు.

# పహల్గాంపై ఖర్గే వ్యాఖ్యలు

- మండిపడ్డ బీజేపీ

**ఢిల్లీ, మే 7:** పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన విమర్శలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేసింది.



జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఘటన గురించి మాట్లాడుతూ.. ఉగ్రవాద దాడి జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాల నుంచి ముందే సమాచారం అందిందని ఖర్గే ఆరోపించిన సంగతి తెలిసిందే. ''దేశంలో పరిస్థితుల గురించి మీ అందరికీ తెలుసు. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించి నిఘా వైఫల్యం ఉందని ప్రభుత్వం అంగీకరించింది. ఇంటెలిజెన్స్ను పటిష్ఠ పరచుకుంటామని వాళ్లే చెప్పారు. దాడికి మూడు రోజుల ముందే నిఘా సమాచారం ఉందని నాకు తెలిసింది. అలాంటప్పుడు అక్కడ (పహల్గాంలో) తగినంత భద్రతా ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నా. ఏదేమైనా పహల్గాం దాడికి వ్యతిరేకంగా పాకిస్థా ఎటువంటి చర్య తీసుకున్నా ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుంది'' అని అన్నారు. రాంచీ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ మాటలు మాట్లాడారు. కాంగ్రెస్ చేసిన ఈ ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదని బీజేపీ అధికార ప్రతినిధి తుహిన్ సిన్హా మీడియాతో అన్నారు. ఉగ్రవాదంపై పోరు నిర్ణయాత్మక దశకు చేరుకున్న సమయంలో ప్రధాని మోదీ, కేంద్రప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని మరో నేత ప్రశ్నించారు. ''పాకిస్థా దాడి విషయంలో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మేం మద్దతు ఇస్తామని చెప్తూనే.. మరోవైపు దేశాన్ని బలహీన పరిచే ప్రయత్నం చేస్తున్నారు. పహల్గాం ఘటన విషయంలో ప్రధానిపై విమర్శలు చేయడం దురదృష్టకరం'' అని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ మండిపడ్డారు.

# ఐరాస భద్రతా మండలి సమావేశం

- శశిథరూర్ కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ, మే 7:** భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులపై మంగళవారం ఐరాస భద్రతా మండలిలో ఒక క్లోజ్డోర్ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు.సభ్యదేశాల సంప్రదింపుల తర్వాత ఐరాస భద్రతామండలి ఎలాంటి తీర్మానాన్ని ఆమోదించదని థరూర్ అన్నారు. ''పాకిస్థాన్‌ను విమర్శిస్తూ ఏ తీర్మానం చేసినా దాన్ని చైనా వీటోతో అడ్డుకుంటుంది.

భారత్‌ను విమర్శిస్తూ తీర్మానం చేసినా చాలా దేశాలు అడ్డుకుంటాయి. శాంతి కోసం పిలుపునివ్వడం, ఉగ్రవాదంపై ఆందోళన వ్యక్తం చేయడం వంటి మామూలు మాటలే వినిపిస్తాయి'' అని అన్నారు. ఇంతకుమించి ప్రత్యేకంగా ఏమీ ఉండకపోవచ్చని అంచనావేశారు. ఇదంతా విచారకరమైన వాస్తవమని వ్యాఖ్యానించారు.

ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ కఠిన చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. అందులో సింధూజలాల ఒప్పందం అమలు నిలిపివేత కూడా ఒకటి. ఈ తరుణంలో ఐరాస సమావేశం జరిగింది. భారత్‌కు వ్యతిరేక తీర్మానం చేయాలని ఈ సమావేశంలో తొలుత పాక్ భావించింది. కానీ, ఈ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఇస్లామాబాద్ బహిరంగ అణు బెదిరింపులపై చాలా సభ్యదేశాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఇటీవల ఆ దేశం క్షిపణి పరీక్షలు నిర్వహించడాన్ని ప్రశ్నించాయి.

## పంజాబ్లో ఉగ్ర కుట్ర.. భగ్నం చేసిన పోలీసులు

**చండీగఢ్, మే 7:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పోలీసులు, భద్రతా బలగాలు దేశంలోని అన్ని ప్రాంతాలలో పెద్దఎత్తున సోదాలు చేపడుతున్నాయి. పహల్గాం దాడి తర్వాత దేశంలో మరిన్ని ఉగ్రదాడులకు అవకాశం ఉందని భారత నిఘా వర్గాలు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భద్రతా బలగాలు, పోలీసులు అప్రమత్తమయ్యారు. పంజాబ్‌లోని అటవీ ప్రాంతం సమీపంలో ఉగ్ర కదలికలు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. ఉగ్ర స్థావరాలపై జరిపిన దాడుల్లో భారీగా గ్రెనేడ్లు, ఐఈడీలు సహా ఉగ్రవాద వైర్‌లెస్ కమ్యూనికేషన్ హార్డ్‌వేర్‌ను స్వాధీనం చేసుకొని ఉగ్రకుట్రను భగ్నం చేసినట్లు వెల్లడించారు.




ఉగ్రదాడులకు పంజాబ్‌లోని స్లీపర్ సెల్స్‌ను పునరుద్ధరించడానికి పాకిస్థాన్ నిఘా సంస్థతో అనుబంధం ఉన్న ఉగ్రవాద సంస్థలు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు గుర్తించామని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ తెలిపారు. మరోవైపు.. కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో ముష్కరులకు సాయం చేస్తున్న ఇద్దరు సహాయకులను భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. వారి నుంచి పెద్దఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతా బలగాలు ధ్వంసం చేసి..పెద్దఎత్తున పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

దేశంలో ఉగ్ర కుట్రలకు ఆస్కారం ఉన్నట్లు నిఘా వర్గాలు హెచ్చరిస్తుండడంతో.. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు సోమవారం కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. యుద్ధ అప్రమత్తతకు పిలుపునిచ్చింది. గగనతల దాడుల గురించి హెచ్చరించే సైరన్ల వ్యవస్థ పనిచేసేలా చూడాలని, ఇతరత్రా స్వీయరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్ర హోంశాఖ సోమవారం అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలనే దానిపై పౌరుల్ని సమాయత్తం చేసేందుకు ఈ నెల 7న (బుధవారం) మాక్డ్రిల్ నిర్వహించాలని కోరింది. ప్రజలందరినీ ఇందులో భాగం చేయాలని సూచించింది. శత్రుదాడి జరిగినప్పుడు స్వీయరక్షణతో పాటు విద్యార్థులు, యువకులు ఎలా ప్రతిస్పందించాలో అవగాహన కల్పించాలని హోంశాఖ తెలిపింది. వైమానిక దాడులు జరిగితే.. ఎలా వ్యవహరించాలి? ప్రజలు ఆందోళనకు గురికాకుండా వారికి ఎలాంటి సూచనలు చేయాలి? సైరన్ ఇచ్చి ఎలా అప్రమత్తం చేయాలనే అంశంపై మాక్డ్రిల్ చేయాలని పేర్కొంది.

## ఉగ్రదాడిపై సమాచారమున్నా ఎందుకు భద్రత కల్పించలేదు..?: ఖర్గే

**రాంచీ, మే 7:** పహల్గాం ఉగ్రదాడి వ్యవహారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. పహల్గాంలో మరింత భద్రత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. 'సంవిధాన్ బచావో' పేరుతో రాంచీ వేదికగా నిర్వహించిన సభలో ఖర్గే ఈ విధంగా స్పందించారు. ''దేశంలో పరిస్థితుల గురించి మీ అందరికీ తెలుసు. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించి నిఘా వైఫల్యం ఉందని ప్రభుత్వం అంగీకరించింది. ఇంటెలిజెన్స్‌ను పటిష్ఠ పరచుకుంటామని వాళ్లే చెప్పారు. దాడికి మూడు రోజుల ముందే నిఘా సమాచారం ఉందని నాకు తెలిసింది. అలాంటప్పుడు అక్కడ (పహల్గాంలో) తగినంత భద్రతా ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నా '' అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.



ఏదేమైనా పహల్గాం దాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌పై ఎటువంటి చర్య తీసుకున్నా ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని మల్లికార్జున ఖర్గే మరోసారి స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా దేశమే తొలి ప్రాధాన్యమన్నారు. రాజకీయ విభేదాలకంటే జాతీయ ఐక్యతే ముఖ్యమన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేసిన ఖర్గే.. ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడమే మోదీ విధానమని ఆరోపించారు. ఆదివాసీ నేతలను భయపెట్టే ధోరణిని అవలంబించకూడదని కేంద్రానికి సూచించారు.

# హార్వర్డ్ యూనివర్సిటీపై ట్రంప్ కొరడా

- ఫెడరల్ నిధులు నిలిపివేత

**కేంబ్రిడ్జి, మే 7:** హార్వర్డ్ యూనివర్సిటీ విషయంలో ట్రంప్ యంత్రాంగం అన్నంతపని చేసింది. ఆ విశ్వవిద్యాలయానికి అందించే ఫెడరల్ నిధులను నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వంలోని విద్యాశాఖ మంత్రి లిండా మెక్మాన్ ప్రకటించారు. విశ్వవిద్యాలయంపై నియంత్రణ ఆశిస్తూ కొన్ని విధానపరమైన మార్పులు తీసుకురావాలని విశ్వవిద్యాలయానికి సూచించినప్పటికీ..

దానికి ససేమిరా అనడంతో విశ్వవిద్యాలయం బడ్జెట్, పన్ను మినహాయింపుల్లో కోతలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ డిమాండ్లను నెరవేర్చే వరకు హార్వర్డ్‌కు ఎటువంటి కొత్త గ్రాంట్లు మంజూరుచేయమని స్పష్టం చేశారు.


ఫెడరల్ పరిశోధన గ్రాంట్లకు మాత్రమే ఈ నిషేధం వర్తిస్తుందని.. యూనివర్సిటీ ట్యూషన్ ఫీజులను చెల్లించడానికి విద్యార్థులకు సహాయపడే ఫెడరల్ ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని విద్యాశాఖ పేర్కొంది. కొత్త గ్రాంట్లకు అర్హత పొందడానికి హార్వర్డ్.. ఫెడరల్ ప్రభుత్వంతో చర్చలు జరపాల్సి ఉంటుందని మెక్మాన్ తెలిపారు. అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్న విదేశీ విద్యార్థులకు హార్వర్డ్‌లో ప్రవేశం కల్పిస్తూ.. దేశ అత్యున్నత విద్యావ్యవస్థను అపహాస్యం చేసిందని ఆరోపించారు. మరోవైపు విశ్వవిద్యాలయంపై జాతి వివక్షపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు.

**చట్టవిరుద్ధ చర్యలను వ్యతిరేకిస్తూనే ఉంటాం: హార్వర్డ్**

అమెరికా ప్రభుత్వం ఫెడరల్ నిధులను నిలిపివేయడాన్ని హార్వర్డ్ విశ్వవిద్యాలయం వ్యతిరేకించింది. ప్రభుత్వం చేసే చట్టవిరుద్ధమైన డిమాండ్లను పాటించడానికి నిరాకరించడంతో సమాఖ్య ప్రభుత్వం విశ్వవిద్యాలయంపై ఇటువంటి చర్యలు తీసుకుంటోందని హార్వర్డ్ అధ్యక్షుడు అలాన్ గార్బర్ పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఎన్నిరకాలుగా అణచివేయడానికి ప్రయత్నించినా పోరాడుతూనే ఉంటామని అన్నారు.

విదేశీ విద్యార్థుల అక్రమ, హింసాత్మక కార్యకలాపాల రికార్డులను సమర్పిస్తేనే కొత్తగా విదేశీయులను చేర్చుకునేందుకు అనుమతిస్తామని వైట్‌హౌస్ గతవారం హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి స్పష్టం చేసింది. రికార్డులను సమర్పించకపోతే వర్సిటీకున్న ప్రవేశాల అర్హతను రద్దు చేస్తామని హెచ్చరించింది. ఈ పరిణామాలపై హార్వర్డ్ స్పందిస్తూ.. ప్రభుత్వ డిమాండ్లకు ఏమాత్రం తలొగ్గేది లేదని.. తమ స్వాతంత్ర్యం, రాజ్యాంగ హక్కుల విషయంలో రాజీ పడలేమని పేర్కొంది. తాము చట్ట ప్రకారమే నడుచుకుంటామని.. ప్రభుత్వ యంత్రాంగం కూడా వాటికి అనుగుణంగానే వ్యవహరించాలని కోరింది. ఈనేపథ్యంలోనే విశ్వవిద్యాలయానికి ఇచ్చే నిధులపై ట్రంప్ యంత్రాంగం కోత విధించింది.

# ఉరుకుంద గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు మృతి



**కౌతాళం, మే 6(మనం న్యూస్)**: కౌతాళం మండల పరిధిలోనే ఉరుకుంద గ్రామంలో మంగళవారం విషాదం చోటు చేసుకుంది.ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పెళ్లికి సంబంధించి టెంట్ వేస్తుండగా విద్యుత్ తీగల తగిలి ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన హరిజన ఈరమ్మ ,విజయ్ కుమారుడు సునీల్ (నాని) (30) సునీల్ కి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండవ వ్యక్తి అదే గ్రామానికి చెందిన హరిజన నాగమ్మ,తిక్కన్న దంపతులకు నలుగురు కుమారులు అందులో మూడవ కుమారుడు మహేంద్ర (22) ఈయనకు ఇంకా పెళ్లి కాలేదు. దీంతో మృతుల కుటుంబాలు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో ఉరుకుందలో విషాదఛాయలు అలముకున్నాయి. కావున తక్షణమే వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# చేనేతలకు స్వర్ణయుగం

## నేతన్నలకు 365 రోజులు పని కల్పించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం

## రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత



**కర్నూలు, మే 06:మనం న్యూస్**: మన ప్రభుత్వంలో చేనేతలకు స్వర్ణయుగం వచ్చిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మే ఒకటవ తేదీన నెల్లూరు జిల్లాలో 175 నియోజకవర్గాలకు ఒకటి చొప్పున 175 ఝుఝుఝు పార్కులకు వర్చువల్ గా భూమి పూజ నిర్వహించిన సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం ఎమ్మిగనూరు మండలం బనవాసి లో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా భూమి పూజ నిర్వహించారు.. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేనేతల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారన్నారు. గత ప్రభుత్వం చేనేతలకు ఎటువంటి మేలు చేకూర్చలేదన్నారు... మంగళగిరిలో చేనేతలు పడుతున్న ఇబ్బందులు దగ్గరుండి చూసినందువల్ల తాను చేనేత జౌళి శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తనని పిలిచి చేనేతలను బాగా చూసుకోవాలని చెప్పారన్నారు.. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం పవర్ లూమ్ కి 500 యూనిట్లు, హ్యాండ్లూమ్ కి 200 యూనిట్లు ఉచిత కరెంట్ అమలు పరుస్తున్నామన్నారు... అంతే కాకుండా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి నెల ఒక్కొక్క చోట ఎగ్జిబిషన్ లను ఏర్పాటు చేసి వారికి సౌకర్యంగా అన్ని సదుపాయాలు కూడా ఏర్పాటు చేసి వారికి కావాల్సిన ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు....ముఖ్యమంత్రి చేసిన కృషి వల్ల రాష్ట్రానికి చాలా క్లస్టర్లు మంజూరు చేసి రూ.348 కోట్లు కేటాయించారన్నారు..చేనేతలకు లేటెస్ట్ డిజైన్ల శిక్షణ ఇచ్చేందుకు గాను స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లను ఏర్పాటు చేయబోతున్నామని, ఎమ్మిగనూరు లో కూడా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. ఫ్రేమ్ లూమ్స్ కావాలనుకునే వారందరికీ వారికి అర్హత ప్రకారం 90 శాతం సబ్సిడీతో ఫ్రేమ్ లూమ్స్ కూడా చేనేతలకు ఇస్తామన్నారు... ఇచ్చిన హామీ మేరకు త్రిఫ్ట్ ఫండ్ కూడా 5 కోట్ల రూపాయలు అందచేస్తామన్నారు..అంతేకాకుండా విశాఖలో 172 కోట్ల రూపాయలతో నిర్మించిన యూనిటీ మాల్ ను కూడా ప్రధానమంత్రి గారు ప్రారంభించారన్నారు.. అందులో మన చేనేతలు తయారుచేసిన వస్త్రాలు ఎగ్జిబిషన్స్ లో నిరంతరాగా పెట్టుకోవచ్చునన్నారు.. ప్రతి చేనేతకు 365 రోజులు పని కల్పించాలనదే రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో చేనేతలకు హెల్త్ పాలసీ కూడా ఇవ్వబోతున్నామన్నారు... అదే విధంగా ఇచ్చిన మాట ప్రకారం చేనేతలకు పెన్షన్ కూడా పెంచామన్నారు... మెగా టెక్స్టైల్ పార్క్ ను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు... 25 ఎకరాల్లో హ్యాండ్లూమ్ పార్క్, మిగతా భూమిలో ఇండస్ట్రియల్ టెక్స్టైల్ పార్క్ తీసుకొని వచ్చి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.... ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచామని, న్నా క్యాంటీన్ లు ప్రారంభించామని, దీపం 2 పథకం కింద ఉచిత సిలిండర్లు అందించామని, ఉచిత ఇసుక అందించామని మంత్రి తెలిపారు. పల్లె పండుగ ద్వారా రోడ్ల మీద గుంతలను పూడ్చామన్నారు.. ఇచ్చిన మాట ప్రకారం కర్నూలు కు హై కోర్టు బెంచ్ తీసుకొని వస్తున్నామని, అదే విధంగా డ్రోన్ హబ్ ను కూడా తీసుకొని వస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చేసిన కృషి వల్ల టెక్స్టైల్ పార్కు సాధ్యమయిందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కు లో మొదటి దశలో 22 ఎకరాల్లో మూడు నెలల్లో మౌలిక సదుపాయాలు పూర్తి చేస్తామన్నారు.. మిగిలిన 50 ఎకరాలలో టెక్స్టైల్ రిలేటెడ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు...పారిశ్రామిక వాడకు ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను కూడా ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మిగనూరు బ్రాండ్ వస్త్రాలకు మా సహకారం ఉంటుందని తెలిపారు. రిలయన్స్ కంపెనీ వారు కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి తెలిపారు.. రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత లను ఆర్థికంగా బలపరచాలనే ఉద్దేశంతో ఇలాంటి పార్కు లను ఏర్పాటు చేశారన్నారు... ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు.. చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి మాట్లాడుతూ టెక్స్టైల్ పార్క్ ను మొదటి ఫేస్ లో అభివృద్ధి చేయడానికి ఏపీఐఐసీ నుంచి రోడ్లు, నీటి సదుపాయాలు కల్పించేందుకు 6.9 కోట్లు నిధులు కేటాయింపు చేశారన్నారు.. ఈ 77 ఎకరాలు పార్కులో 22 ఎకరాలు చిన్న చిన్న ప్లాట్లుగా మగ్గాలు పెట్టుకోవడానికి, మిగిలిన భూమి వస్త్ర పరిశ్రమ ఏర్పాటు చేసుకోవడానికి కేటాయించుకోవడం జరిగిందని కమిషనర్ తెలిపారు.వీవర్స్ కి ఐడెంటిటీ కార్డు ఇప్పించడం జరుగుతుందని, దీని వలన ముద్ర లోన్ వస్తుందని , కరెంటు ఫ్రీగా లభిస్తుందని తెలిపారు. ఇక్కడ కేటాయించిన ప్రదేశంలో షెడ్ లాగా కట్టుకొని, క్యాంటీన్ పెట్టుకొని, డిజైన్స్ స్టూడియో పెట్టుకున్నట్లైతే 365 రోజులు పని ఉంటుందని తెలిపారు. మన మార్కెటింగ్ మనమే చేసుకుని లాభపడవచ్చునని తెలిపారు.


# వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చండి



- **బివిఎస్ పత్తికొండ నియోజకవర్గ కార్యదర్శి చెన్నకేశవ నాయుడు**

**మద్దికేర, మే 6(మనం న్యూస్ )**: వాల్మీకి బోయ లను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణ చేయాలని బివిఎస్ పత్తికొండ నియోజకవర్గ కార్యదర్శి చెన్నకేశవ నాయుడు డిమాండ్ చేశారు.మద్దికేర మండల పరిధిలోని మదనంతపురం గ్రామంలో బివిఎస్ కమిటీ సమావేశంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకులకు ఇచ్చిన ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణఅంశాన్ని తక్షణమే అమలు చేయాలని, వాల్మీకి ఫెడరేషన్ కు నిధులు ఇవ్వాలని,వాల్మీకులపై క్రమంగా ఉన్న ఎస్సీ,ఎస్టి ఉన్నటువంటి కేసులను తొలగించాలని, లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్,రవి,రాజు,రామకృష్ణ,నారాయణ, రామప్ప, నాగేంద్ర,చిన్న, రంగస్వామి,చిరంజీవి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వర్గ ఆశాజ్యోతి కార్ల్ మార్క్స్



**కర్నూల్, మే 6 (మనం న్యూస్)**: ప్రపంచ కార్మిక వర్గపు ఆశాజ్యోతి కార్ల్ మారక్స్ అని చైతన్య పార్టీ రాష్ట్ర అధ్యక్షు,కార్యదర్శులు శివ శంకర్ ,క్రాంతి కుమార్ లు పేర్కొన్నారు. నగరంలోని ధర్మ పేట అంబేద్కర్ సర్కిల్ లో కార్ల్ మారక్స్ 207వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని దోపిడీ నుంచి విముక్తి చేసే గొప్ప సిద్ధాంతాన్ని మారక్స్ రూపొందించారని తెలిపారు. పెట్టుబడిదారీ సమాజంలో నిరుద్యోగం, పేదరికం రోజురోజుకు తీవ్రమవుతున్నాయని చెప్పారు. ఒక మనిషిని ఇంకొక మనిషి దోపిడీ చేసే వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని కార్ల్ మారక్స్ ఉద్భృతం చేశారని పేర్కొన్నారు. సమాజంలో అందరికీ తిండి, ఇల్లు, బట్ట లాంటి కనీస సౌకర్యాలు అందుబాటులోకి రావాలని, దానికి అనుగుణంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారన్నారు. సమాజంలో రోజురోజుకు పేదల సంఖ్య పెరుగుతోందని, అదే స్థాయిలో కార్పొరేట్ల సంపద కూడా తీవ్రంగా పెరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ధనిక, పేదల మధ్య అంతరాలు తగ్గించేందుకు మార్క్సిజం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. శ్రామిక వర్గం కులం, మతం ప్రాతిపదికన కాకుండా శ్రమ ఆధారంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మారక్స్ జీవితంలో అనేక త్యాగాలు మనకు స్ఫూర్తిదాయకమని, ఆ త్యాగాల స్ఫూర్తితో సమ సమాజ స్థాపన కోసం సిపిఎం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మార్క్స్, ఎంగిల్స్ కార్మిక వర్గం కోసం తమ యావదాస్తిని త్యాగం చేయడంతో పాటు కుటుంబంలో అనేక రకాల ఇబ్బందుల్ని ఎదుర్కొని ముందుకు సాగారని అన్నారు. అలాంటి త్యాగ స్ఫూర్తితో దోపిడీ సమాజానికి వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని సమరశీల పోరాటాలకు సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య పార్టీ కార్యకర్తలు మల్యాల నాగరాజు,మహేంద్ర,ప్రసాద్,మోజేష్, రాజేంద్ర ప్రసాద్,ప్రాతకోట పులామారాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకి ఉర్సు ఆహ్వాన పత్రికను అందజేసిన దర్గా ధర్మకర్త



**కౌతాళం మే 6 మనం న్యూస్ :** మండల కేంద్రమైన కౌతాళంలో వెలిసిన జగద్గురు ఖాదర్ లింగస్వామి 321వ ఉరుసు ఉత్సవం ఈ నెల 9నుంచి ప్రారంభమై 13వరకు ఘనంగా జరుగుతుందని 10వ తేదీ శనివారం గంధం,11వ తేది ఆదివారం ఉరుసు ఉత్సవం ఉంటుందని ఈ ఉత్సవానికి రావాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నాభాష ఆహ్వాన పత్రికను అందజేశారు.ఆయన వెంట లింగస్వామి శిష్యరిక బృందం ఉన్నారు.

# నేడు ఆదోని ఎమ్మెల్యే రాంపల్లికి రాక

- **బిజెపి మండల అధ్యక్షులు చక్రాల టైలర్ లక్ష్మన్న**



**తుగ్గలి, మే 6(మనం న్యూస్ )**: ఆదోని శాసనసభ్యులు పార్థసారథి బుధవారం రాంపల్లి గ్రామానికి వస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు చక్రాల టైలర్ లక్ష్మన్న పేర్కొన్నారు .ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆధ్వర్యంలో రాంపల్లి గ్రామంలో 30 కుటుంబాలు భారతీయ జనతా పార్టీలో చేరుతున్నట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు మండల నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున హాజరవుతున్నట్లు లక్ష్మన్న తెలిపారు.

# మహిళలు స్వయం ఉపాధితో రాణించాలి




- **పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి**

**గడివేముల, మే6(మనం న్యూస్)**: మహిళలు స్వయం ఉపాధితో రాణించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గడివేములలో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో మండల పొదుపు ఐక్య సంఘం భవనములో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మంగళవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ మహిళల సంరక్షణనే ధ్యేయంగా వారికి స్వయంగా ఉపాధి కల్పించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలలో మహిళలకు పెద్దపీట వేస్తూ అభివద్ధిలో భాగంగా.ఈ ఉచిత కుట్టుమిషన్ శిక్షణ సుమారు వంద రోజులు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం ట్రైనర్ని ఏర్పాటు చేసి మొదటి విడతగా ఉదయం 50 మంది, మధ్యాహ్నం 50 మంది కి శిక్షణ ఇస్తున్నారని, శిక్షణ కు 75శాతం హాజరున్న వారికీ ఎడు వేల రూపాయల విలువగల కుట్టు మిషన్ ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత రెండు, మూడు బ్యాచులు కూడా ఉంటాయన్నారు.కూటమి ప్రభుత్వం లో ప్రతి ఇంటినుండి ఒక పారిశ్రామిక వ్యక్తిని తయారు చేయడం చంద్రబాబు ధ్యేయం అన్నారు.ఈ కార్యక్రమం లో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ రాజు, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీఓ వాసుదేవగుప్తా, ఏపీఎం నాగరాజు, మండల టీడీపీ కన్వీనర్ దేశం సత్యానారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాస రెడ్డి, కరిమద్దెల ఈశ్వరరెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బత్తుల సుభద్రమ్మ, ఒడ్డు లక్ష్మీదేవి, కష్ణ యాదవ్, శ్రీనివాస యాదవ్, రాజు నాయక్, గంగాధర్ రెడ్డి,టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కుట్టుమిషన్ శిక్షణ తీసుకుంటున్న మహిళలు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం 28,000 వేల రూపాయలు ఇవ్వాలి

**గడివేముల, మే6(మనం న్యూస్)**: మండల కేంద్రమైన గడివేములలోని ఆశా వర్కర్లు తమ డిమాండ్లను నెరవేర్చాలని వైద్యాధికారి కిరణ్ కుమార్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపుతో దేశవ్యాప్తంగా మే 20న జరుగుతున్న జరిగే సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొని తమ డిమాండ్లను విన్నవించుకోవాలని తెలిపారు. లేబర్ కోడ్సు ను రద్దు చేయాలి, కనీసం వేతనాలు 28 వేల రూపాయలు చెల్లించాలి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లని ఆశాలుగా మార్చాలి, ఒప్పంద జీవో విడుదల చేయాలి, ఆశా నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలి, సంక్షేమ పథకాలు అమలు చేయాలి, పిహెచ్సి మీటింగ్ లకు టీఏ,డీఏలు ఇవ్వాలి, ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదు. తమ డిమాండ్ల సమస్యలను నెరవేరేవరకు పోరాటం చేస్తామని ఆశ వర్కర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు చెన్నమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మారమ్మ దేవర ఉత్సవాలు



**తుగ్గలి, మే 6(మనం న్యూస్)**: తుగ్గలి మండల పరిధిలోని రోళ్లపాడు తాండ గ్రామం లో వెలసిన మారెమ్మ అవ్వ జాతర ఉత్సవాలు మంగళవారము ఘనంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .గత కొన్ని సంవత్సరాలు నుండి గ్రామంలో వెలిసిన మారెమ్మ అవ్వకు గ్రామ పెద్దలు దేవర ఉత్సవాలను నిర్వహిస్తూ ఉన్నారు.అందులో భాగంగానే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



- **27 వసంతాల మన కలయిక అమోఘం- మన స్నేహం అద్వితీయం**

**తుగ్గలి, మే 6( మనం న్యూస్ )**: మండల కేంద్రమైన తుగ్గలి గ్రామం ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-2003 పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులైన సుధాపరిమళ,అరుణ కుమారి ,ప్రమీలమ్మ, శ్రీరామలయ్య, రామయ్య, నూరుల్లా, జాకీర్ హుస్సేన్,హుస్మాన్ బాషా, ఓబులేసు, శ్రీనివాసులు లకు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకొని,శాలువా పూలమాలలతో పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు, ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాల ను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు..ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పూర్వ విద్యార్థినీయులు మరియు రాజు,రామయ్య, బ్రహ్మయ్య,జిలాన్,రఫీ, నాగేంద్ర, రాంబాబు, రంగా,శ్రీరాములు,శివకుమార్,షేక్షావలి,పురుషోత్తం, మాస్తానయ్య,మల్లికార్జున, పురుషోత్తం, చంద్రశేఖర్.మూర్తి,ప్రసాద్,సుధాకర్ రెడ్డి,ఇమ్రాన్, రాజు, నాగేష్,రంగస్వామి, రామచంద్రుడు, వెంకటరంగయ్య,మాబాషా,తిమ్మప్ప,ఎర్రస్వామి,నాగన్న,చంద్రబాబు,రంగనాయకులు,నాగార్జున,చందుబాషా,రఘురామిరెడ్డి,బసప్ప,అంజి,ఆంజనేయులు,బాలకృష్ణ,ఆది,రమేష్, వైకుంఠం, జనార్దన్,తిమ్మప్ప,రవి, ఓబులేసు, రమేష్, సునీల్,తిప్పన్న, శివశంకర్, దాసన్న, వెంకటేష్, లక్ష్మి నారాయణ,రామాంజి,సుంకన్న, రాముడు, మనోహర్,హరి,నరసన్న,శ్రీకృష్ణ,చిన్న రంగన్న, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్స్ కు కనీస వేతనం ఇవ్వాలని మే 20 న దేశవ్యాప్త సమ్మె

**బేతంచెర్ల, మే6(మనంన్యూస్)**: కార్మికులను యాజమానులకు కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని కోరుతూ మే 20 న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఆశా వర్కర్స్ సమ్మెలో పాల్గొంటారని ఆర్ఎస్ రంగాపురం గ్రామం పీహెచ్సీలో డాక్టర్ అలీమ్ కు బేతంచెర్ల పట్టణంలో దర్గా దగ్గర ఉన్న హెల్త్ సెంటర్ దగ్గర డాక్టర్ ప్రియాంక కు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య సిఐటియు మండల కార్యదర్శి ఎస్ రహంతుల్లా సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎల్లయ్య రహంతుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షించాలని ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని ఒప్పంద జీవోలు విడుదల చేయాలని చట్టబద్ధమైన సౌకర్యాలు సంక్షేమ పథకాల అమలు చేయాలని వారు తెలిపారు గత 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని ప్రభుత్వం వీరి సేవలను గుర్తించి కార్మికులుగా గుర్తించాలని ఇతర సౌకర్యాలను కల్పించాలని వారు డిమాండ్ చేశారు విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు అనారోగ్యంతో ఆశ వర్కర్లు అర్ధాంతరంగా మరణిస్తే ప్రభుత్వం ఆశ వర్కర్స్ కు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్స్ సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా మే 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశ వర్కర్స్ అందరూ పాల్గొనాలని మరియు కార్మికులు ఈ సమ్మెను జయప్రదం చేయాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.



# వైసిపి నాయకులు ప్రత్యేక పూజలు



**గడివేముల, మే 6(మనంన్యూస్)**: మండలం బూజులూరు గ్రామంలో శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారి ఊరుదేవర తిరుణాల మహోత్సవ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, కర్నూల్ మేయర్ బి వై రామయ్య, నంద్యాల మాజీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సర్పంచ్ రాములమ్మ, వై శివరామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, రఘు మాధవరెడ్డి, ఎల్లారెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, ఉండుట్ల రవీంద్రనాథ్ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



# చరిత్ర సృష్టించిన సూర్య

ముంబై ఇండియన్స్ స్టార్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్లో ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక సీజన్లు 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఆటగాడిగా అవతరించాడు. ఈ ఐపీఎల్ సీజన్లో కలుపుకుని సూర్య ఇప్పటివరకు మూడు సార్లు ఓ సీజన్లో 500 ప్లస్ పరుగులు చేశాడు. సూర్య తర్వాత ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక సీజన్లు 500 ప్లస్ పరుగులు చేసిన ఘనత సచిన్ టెండూల్కర్, క్వింటన్ డికాక్కు దక్కుతుంది. వీరిద్దరు తలో రెండు సార్లు ఈ ఘనత సాధించారు.

ఇవాళ (మే 6) గుజరాత్తో జరుగుతున్న మ్యాచ్లో సూర్య ఈ సీజన్లో 500 పరుగుల మార్కును తాకాడు. ఈ మ్యాచ్లో సూర్య సీజన్ లీడింగ్ రన్ స్కోరర్గానూ అవతరించాడు. ఈ మ్యాచ్లో 24 బంతుల్లో 5 ఫోర్ల సాయంతో 35 పరుగులు చేసిన సూర్య సాయి కిషోర్ బౌలింగ్లో షారుక్ ఖాన్కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఈ సీజన్లో సూర్య 12 మ్యాచ్లో 510 పరుగులు చేసి లీడింగ్ రన్ స్కోరర్గా కొనసాగుతున్నాడు. ఆరెంజ్ క్యాప్ సాధించే క్రమంలో సూర్య విరాట్ను (505) అధిగమించాడు.

**ఈ సీజన్లో సూర్య చేసిన స్కోర్లు..**

29(26), 48(28), 27₹(9), 67(43), 28(26), 40(28), 26(15), 68₹(30), 40₹(19), 54(28), 48₹(23) 35(24)

**ఈ సీజన్ లో టాప్-6 లీడింగ్ రన్ స్కోరర్లు..**

సూర్యకుమార్ యాదవ్-510
విరాట్ కోహ్లి- 505
సాయి సుదర్శన్- 504
యశస్వి జైస్వాల్- 473
జోస్ బట్లర్- 470
శుభ్మన్ గిల్- 465




# టెస్టులకు కొత్త వైస్ కెప్టెన్?

భారత టెస్టు జట్టుకు కొత్త కెప్టెన్ రానున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియా పర్యటనకు వైస్ కెప్టెన్గా ఎంపికవడమే కాక.. రోహిత్ శర్మ గైర్హాజరీలో రెండు టెస్టులకు నాయకత్వం కూడా వహించిన జస్ప్రీత్ బుమ్రా ఆ బాధ్యతల్లో కొనసాగకపోవచ్చని తెలుస్తోంది. కొన్నేళ్లుగా బుమ్రా గాయాలతో సతమతం అవుతున్నాడు. గతంలో ఏడాదికి పైగా ఆటకు దూరమైన అతను.. ఆస్ట్రేలియా పర్యటన అనంతరం దాదాపు నాలుగు నెలలు అందుబాటులో లేకుండా పోయాడు. ఈ ఐపీఎల్ మధ్యలో ముంబయి జట్టులోకి వచ్చిన బుమ్రా.. ప్రస్తుతం ఫిట్గానే కనిపిస్తున్నాడు. ఇంగ్లాండ్ పర్యటనలో అతను కీలకం కానున్నాడు. అయితే బుమ్రా తరచుగా గాయాల పాలవుతున్న నేపథ్యంలో అతడిపై పని ఒత్తిడి తగ్గించడం కోసం మ్యాచ్ల మధ్య విరామం ఇవ్వడంతో పాటు నాయకత్వ బృందం నుంచి దూరంగా ఉంచాలని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్తో సిరీస్కు కొత్త వైస్ కెప్టెన్ను ఎంపిక చేయొచ్చని తెలుస్తోంది. ఇందుకోసం శుభ్మన్ గిల్, కేఎల్ రాహుల్ పేర్లను పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నాయి. ఈ పర్యటనలో రోహిత్ శర్మే జట్టును నడిపించనుండగా.. అతడి కెరీర్ చరమాంకంలో ఉన్న నేపథ్యంలో ఇప్పుడు ఎంపికయ్యే వైస్కెప్టెన్ను భవిష్యత్ సారథిగానూ భావించవచ్చు. ఇంగ్లాండ్ పర్యటనకు సన్నాహాలు షురూ: భారత ఆటగాళ్లంతా ఐపీఎల్లో మునిగి ఉండగా.. టీమ్ఇండియా తర్వాత పర్యటనకు బీసీసీఐ సన్నాహాలు మొదలుపెట్టింది. వచ్చే నెల 20 నుంచి ఇంగ్లాండ్లో అయిదు టెస్టులు ఆడనుంది భారత్. దానికంటే ముందు ఇండియా-ఎ జట్టు..

ఇంగ్లాండ్ లయన్స్తో మూడు ఫస్ట్క్లాస్ మ్యాచ్లో తలపడుతుంది. రెంటికీ కలిపి దాదాపు 35 మందితో ఒక తుది జాబితా సిద్ధం చేసిన భారత బోర్డు.. ఆటగాళ్ల పాస్పోర్టులు తీసుకుని వారి వారి షెడ్యూళ్లను బట్టి ప్రయాణ ఏర్పాట్లను మొదలుపెట్టినట్లు సమాచారం.

ఇండియా-ఎ తొలి మ్యాచ్ ఈ నెల 30న ఆరంభం కానుండగా.. 25న జట్టు ప్రయాణమవుతుంది. ఐపీఎల్ ఆడని ఆటగాళ్లతో పాటు.. ఈ టోర్నీలో లీగ్ దశ ముగిశాక ప్లేఆఫ్స్కు దూరమైన జట్ల నుంచి కొందరు క్రికెటర్లను ఎంపిక చేసి ఈ జట్టుతో పంపుతారు. టెస్టు జట్టులోని ఆటగాళ్లు జూన్ తొలి వారం నుంచి దశల వారీగా ఇంగ్లాండ్కు బయల్దేరుతారు. ఆస్ట్రేలియా పర్యటనలో మాదిరి అంతర్గత మ్యాచ్ కాకుండా ఇంగ్లాండ్ లయన్స్తో ఫస్ట్క్లాస్ మ్యాచ్లో ఆడాలని టీమ్ఇండియా ఆటగాళ్లు భావిస్తున్నారు.

# ఓజాస్ గంభీర.. ఆగమనంకి ఆల్ సెట్?


మన టాలీవుడ్ పవర్ స్టార్ అలాగే ఏపీ డిప్యూటీ సీఎం కూడా అయినటువంటి పవన్ కళ్యాణ్ హీరోగా చేస్తున్న చిత్రాల్లో దర్శకుడు సుజీత్ తో చేస్తున్న పక్కా యాక్షన్ గ్యాంగ్ స్టర్ డ్రామా ఓజి కూడా ఒకటి. అయితే ఈ సినిమా అనౌన్స్ చేసిన నాటి నుంచి వేరే లెవెల్ హైప్ కనిపిస్తుండగా ఇప్పుడు మళ్ళీ ఓజి పై అభిమానుల్లో సందడి నెలకొంది. ఇక చాలా కాలం నుంచి పవన్ డేట్స్ కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి గుడ్ న్యూస్ వినిపిస్తుంది.

దీని ప్రకారం ఓజి సెట్స్ లోకి ఓజాస్ గంభీర ఆగమనం ఈ మే 14 నుంచే ఉంటుంది అని రూమర్స్ వినిపిస్తున్నాయి. అలాగే దాదాపు ఈ నెలాఖరు వరకు పవన్ ఓజి కోసమే సమయం వెచ్చించనున్నట్టుగా టాక్. మరి ఇందులో ఎంతమేర నిజం ఉంది అనేది చూడాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

**వీరమల్లు సెట్స్ లో మాటల మాంత్రికుడు.. ఫ్యాన్స్ టెన్షన్!**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హరిహర వీరమల్లు' కోసం అభిమానులు ఏ రేంజ్లో వెయిట్ చేస్తున్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ సినిమాను దర్శకుడు జ్యోతికృష్ణ డైరెక్ట్ చేస్తుండగా పూర్తి హిస్టారికల్ చిత్రంగా ఈ మూవీ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. ఇక ఈ సినిమాలో పవన్ తన పాత్రతో ప్రేక్షకులను స్టన్ చేసేందుకు సిద్ధమవుతున్నాడు.

అయితే, ఈ సినిమాకు సంబంధించి తాజాగా సినీ సర్కిల్స్లో ఓ ఇంట్రెస్టింగ్ వార్త చక్కర్లు కొడుతోంది. ఈ సినిమా షూటింగ్లో పవన్ ఇటీవల జాయిన్ అయ్యాడు. ఈ షెడ్యూల్తో ఈ మూవీ షూటింగ్ ముగుస్తుందని చిత్ర యూనిట్ చెబుతోంది. అయితే, ఈ సినిమా సెట్స్లో పవన్తో పాటు దర్శకుడు త్రివిక్రమ్ కూడా కనిపించాడట. దీంతో పవన్ ఫ్యాన్స్ టెన్షన్ పడుతున్నారు. గతంలో కూడా త్రివిక్రమ్ పవన్ నటించిన బ్రో, భీమ్లా నాయక్ చిత్రాల సెట్స్లో కనిపించాడు. ఆ సినిమాలు ప్రేక్షకులను పూర్తి స్థాయిలో ఆకట్టుకోలేకపోయాయి. దీంతో ఇప్పుడు వీరమల్లు సెట్స్లో త్రివిక్రమ్ ఏం చేస్తున్నాడో అని అభిమానులు ఆరా తీస్తున్నారు.






## పవన్ కల్యాణ్ తో డేటింగ్.. ప్రభాస్తో మ్యారేజ్: ఫరియా అబ్దుల్లా

ఒకవేళ అవకాశం వస్తే ఒకప్పటి పవన్ కల్యాణ్ తో డేటింగ్, యంగ్ నాగార్జునతో లవ్, ప్రభాస్ను మ్యారేజ్ చేసుకుంటానంటోంది ఫరియా అబ్దుల్లా. యాంకర్ సుమ అడిగిన ప్రశ్నలకు అలా సమాధానమిచ్చింది. సుమ నిర్వహిస్తున్న 'చాట్ షో' లేటెస్ట్ ఎపిసోడ్కు అతిథిగా హాజరైంది ఫరియా. తనదైన శైలిలో సమాధానాలిస్తూ వినోదం పంచుతూనే.. సుమపై ర్యాప్ సాంగ్ పాడి అలరించింది. తాజాగా ప్రోమో విడుదలైంది. ఫుల్ ఎపిసోడ్ త్వరలో రిలీజ్ కానుంది.




# రామ్ చరణ్ మైనపు విగ్రహం.. లండన్ వెళ్లిన మెగా ఫ్యామిలీ

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం ఓ అరుదైన గౌరవాన్ని పొందుతున్నాడు. లండన్లో ప్రపంచ ప్రఖ్యాత మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో రామ్ చరణ్ మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమం కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అయితే, రామ్ చరణ్కు దక్కనున్న ఈ అరుదైన గౌరవాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు మెగా ఫ్యామిలీ లండన్కు పయనం అయ్యింది. మెగాస్టార్ చిరంజీవి, ఆయన భార్య సురేఖ తో పాటు.. రామ్ చరణ్, ఆయన భార్య ఉపాసన, కూతురు క్లిన్ కారా లండన్కు పయనం అయ్యారు.

ఆర్ఆర్ఆర్ చిత్రంతో రామ్ చరణ్ స్థాయి గ్లోబల్ స్టార్గా ప్రపంచవ్యాప్తంగా ఎలా విస్తరించిందో అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఆయన మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.



**'పెద్ది'లో కిసుక్కు అనిపించే బ్యూటీ..?**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'పెద్ది'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ అయ్యాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ పూర్తి రగడ్ లుక్లో కనిపిస్తుండటంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు.

ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా సినీ సర్కిల్స్లో ఓ ఇంట్రెస్టింగ్ వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఓ అదిరిపోయే మాస్ మసాలా సాంగ్ ఉండనుందని తెలుస్తోంది. ఈ స్పెషల్ సాంగ్లో 'కిస్సిక్' అంటూ నేషన్ను షేక్ చేసిన యంగ్ బ్యూటీ శ్రీలీల డ్యాన్స్ చేయబోతుందనే వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే పుష్ప-2 మూవీలో అమ్మడి పాటకు యమ క్రేజ్ దక్కింది.

దీంతో ఇప్పుడు మరోసారి ఈ బ్యూటీతో బుచ్చిబాబు సాలిడ్ సాంగ్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం చాలా సెలెక్టివ్గా సినిమాలను లైనప్ చేస్తున్న ఈ బ్యూటీ, పెద్ది కోసం మరోసారి స్పెషల్ అవతారం ఎత్తుతుందా లేదా అనేది చూడాలి.



# బాలయ్య సినిమాలో మోక్షు కూడా?

ప్రస్తుతం నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా దర్శకుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న అవైటెడ్ చిత్రం అఖండ 2 కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ సినిమా తర్వాత బాలయ్య నుంచి మరిన్ని సాలిడ్ ప్రాజెక్ట్ లు సిద్ధం అవుతుండగా వీటిలో ఓ క్రేజీ కలయిక ఉంటుంది అని ఇపుడు టాక్ వినిపిస్తుంది.

అయితే బాలయ్య వారసుడు నందమూరి మోక్షజ్ఞ తేజ ఎంట్రీ కోసం ఎప్పుడు నుంచో అభిమానులు ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే.. అయితే ఈ ఎంట్రీతో పాటుగా మరో సినిమాలో బాలయ్య, మోక్షజ్ఞ కనిపిస్తే ఎలా ఉంటుంది? ఇపుడు అదే సాధ్యం అయ్యేలా ఉందని తెలుస్తుంది. బాలయ్యతో దర్శకుడు క్రిష్ జాగర్లమూడి ఓ సాలిడ్ ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తుండగా ఈ సినిమాలోనే మోక్షజ్ఞ కూడా కనిపించే ఛాన్స్ ఉందని తెలుస్తుంది. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది వేచి చూడాలి.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.